జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

PUBLISHED: TG & AP | సంపుటి : 1 | సంచిక: 43 | 4-7-2025 శుక్రవారం | పేజీలు : 8 | వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు


ఎడిటర్ : 90520 45435

## భారత్‌లో 2500కు పైగా పార్టీలు

**ఘనా పార్లమెంట్‌లో ప్రధాని మోదీ**

**ఆశ్చర్యం వ్యక్తం చేసిన అక్కడి ఎంపీలు**

**మోదీకి 'ది స్టార్ ఆఫ్ ఘనా'తో సత్కారం**



అక్రా, (సందేశం టైమ్స్)జూలై 3: పశ్చిమ ఆఫ్రికా దేశం ఘనాలో పర్యటిస్తున్న ప్రధాని మోదీ.. ఆ దేశ పార్లమెంట్‌లో ప్రజాస్వామ్యం గురించి గురువారం ప్రసంగించారు. ఘనాలో పర్యటించడం తనకు దక్కిన గౌరవమన్నారు. భారత్‌లో 2500కు పైగా రాజకీయ పార్టీలున్నాయని ఆయన చెప్పగా.. ఘనా ఎంపీలు ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. ఇది చూసి ప్రధా ని మళ్లీ అదే విషయాన్ని గట్టిగా ప్రస్తావించగా.. అంతా చిరునవ్వులు చిందించారు. భారత్‌లో ప్రజాస్వామ్యం అనేది ఓ వ్యవస్థ మాత్రమే కాదని.. ప్రాథమిక విలువల్లో భాగమన్నారు. భారత్‌ను ప్రజాస్వామ్యానికి తల్లిగా ఆయన అభివర్ణించారు. 'మా దేశంలో 22 పార్టీలు వివిధ రాష్ట్రాలను పాలిస్తున్నాయి. 22 అధికారిక భాషలున్నాయి. వేల కొద్ది మాండలికాలున్నాయి' అని వ్యాఖ్యానించారు. అంతకుముందు మోదీని 'ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఘనా' అవార్డుతో సత్కరించారు. ఇక పర్యటనలో భాగంగా రెండు దేశాల మధ్య పరిశోధన, అభివృద్ధి, ఔషధ తదితర రంగాల్లో ఒప్పందాలు కుదిరాయి

## ప్రపంచ వ్యాపార కేంద్రంగా హైదరాబాద్!

**అంతర్జాతీయ స్థాయిలో 'భారత్ ఫ్యూచర్ సిటీ'**


**పెట్టుబడిదారులకు పూర్తి రక్షణ కల్పిస్తాం**

**మలబార్ ఆభరణాల తయారీ యూనిట్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**



రంగారెడ్డి జిల్లా (సందేశం టైమ్స్)జూలై 3: తెలంగాణలో పెట్టుబడిదారులకు పూర్తి రక్షణ కల్పిస్తామని, వ్యాపారాలు లాభదాయకంగా కొనసాగేలా చూస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. హైదరాబాద్‌ను పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చి, ప్రపంచ వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వాలు మారినంత మాత్రాన విధానాల్లో, ప్రోత్సాహకాల్లో మార్పు ఉండదని స్పష్టం చేశారు. వాటిని మరింత మెరుగ్గా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మహేశ్వరం పారిశ్రామిక పార్కులో ప్రముఖ ఆభరణాల తయారీ సంస్థ మలబార్ నిర్మించిన 'మలబార్ జెమ్స్ అండ్ జ్యూయలరీ' తయారీ కేంద్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి.అహ్మద్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు దేశంలో ఏ నగరం పోటీ కాదని, ప్రపంచ స్థాయి నగరాలతోనే పోటీ అని చెప్పారు. ఇందులో భాగంగానే మహేశ్వరంలో అంతర్జాతీయ స్థాయిలో 'భారత్ ఫ్యూచర్ సిటీ' నిర్మాణానికి రూపకల్పన చేస్తున్నామన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తర్వాత ఇప్పుడు తమ ప్రభుత్వం నాలుగో నగరాన్ని నిర్మించి.. దేశానికి ఫ్యూచర్ సిటీని అందించే ఏర్పాట్లు చేస్తోందని చెప్పారు. రాబోయే వందేళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని విజన్ 2047 ప్రణాళికను రూపొందిస్తున్నామన్నారు. తెలంగాణ రైజింగ్ పేరుతో దీన్ని డిసెంబరు 9న ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. చరిత్రలో గుర్తుండిపోయేలా మహేశ్వరం నియోజకవర్గంలో 35 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామన్నారు.

## అధికారికంగా రోశయ్య జయంతి



హైదరాబాద్/ అమీర్‌పేట, (సందేశం టైమ్స్)జూలై 3: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన 92వ జయంతి. తమ ప్రభుత్వం ఆయనకు అరుదైన గౌరవం కల్పించిందని పేర్కొన్నారు. రోశయ్య జయంతి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆయనను స్మరించుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 16 సార్లు ఆర్థిక మంత్రి హోదాలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత రోశయ్య దక్కించుకున్నారని గురువారం తెలిపారు. ఆయన 50 ఏళ్లు క్రియాశీల రాజకీయాల్లో చురుగ్గా ఉన్నా.. వివాద రహితుడిగా పేరు పొందారని సీఎం పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రాజీనామా చేసిన తర్వాత తమిళనాడు గవర్నర్‌గా రోశయ్య సేవలు అందించారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. కాగా, 450 కిలోల రోశయ్య విగ్రహాన్ని లక్డీకాపూల్ చౌరస్తాలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు మెట్రో రైల్వే స్టేషన్ సమీపాన పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరిస్తారు. ఈ నేపథ్యంలో ఆయన విగ్రహావిష్కరణ ఏర్పాట్లను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తదితర అధికారులు సమీక్షించారు. రోశయ్య ఆయన విగ్రహం ఏర్పాటుకు సీఎం రేవంత్ చొరవ చూపడంపై డాక్టర్ కొణిజేటి రోశయ్య స్మారక వేదిక హర్షం వ్యక్తం చేసింది. వేదిక సభ్యులు కామిశెట్టి అనిల్ కుమార్, ఫెడరేషన్ ఆఫ్ అవోపాస్ జాతీయ అధ్యక్షుడు సీఏ బెల్ది గురువారం రోశయ్య నివాసంలో మీడియాతో మాట్లాడుతూ.. అతి తక్కువ సమయంలోనే ఆయన విగ్రహం తయారు చేయడంతోపాటు ఆవిష్కరిస్తున్నందుకు వైశ్యులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో మహిళలకు గౌరవం దక్కాలి




హైదరాబాద్, (సందేశం టైమ్స్)జూలై 3: అన్ని రంగాల్లో మహిళలకు సరైన ప్రాతినిధ్యం, గౌరవం దక్కాలని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ అన్నారు. మధ్యప్రదేశ్‌లో మహిళా న్యాయమూర్తుల సంఖ్య 50 శాతం దాటిందని, భవిష్యత్తులో పురుషులే రిజర్వేషన్ కోరాల్సిన అవసరం రావచ్చని పేర్కొన్నారు. హైకోర్టు జెండర్ సెన్సిటైజేషన్ అండ్ ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం కార్యక్రమాన్ని గురువారం హైకోర్టు బార్ అసోసియేషన్‌లో నిర్వహించారు.ఈ సందర్భంగా జస్టిస్ పాల్ మాట్లాడుతూ తెలంగాణలో సైతం మహిళా న్యాయమూర్తుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, రిజర్వేషన్ లేకుండానే హైకోర్టులో 30 శాతం కంటే ఎక్కువ మంది మహిళా న్యాయమూర్తులు ఉన్నారని పేర్కొన్నారు. కమిటీ చైర్‌పర్సన్ జస్టిస్ మాధవీదేవి మాట్లాడుతూ.. హైకోర్టులో లింగ వివక్ష లేకుండా చూడటంతోపాటు ఫిర్యాదులపై విచారణ చేపట్టేందుకు ఈ కమిటీ ఏర్పాటైందని తెలిపారు. దీనికి కేవలం రెండు ఫిర్యాదుల మాత్రమే వచ్చాయని, వాటిని సైతం పరిష్కరించామని పేర్కొన్నారు. కమిటీ సభ్యురాలు జస్టిస్ శ్రీదేవి మాట్లాడుతూ మహిళలకు గౌరవప్రదమైన పని వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహారెడ్డి, టీహెచ్‌సీఏఏ అధ్యక్షుడు ఏ జగన్ పాల్గొన్నారు.

## ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకం పెంచాలి



హైదరాబాద్, (సందేశం టైమ్స్)జూలై 3: ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని గతంలో మాదిరిగా 44 శాతానికి పెంచాలని కోరుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. దిగుమతి సుంకం తగ్గింపుతో వంటనూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించలేమన్నారు.కేంద్రం మే 31న ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 27.5 శాతం నుంచి 16.5 శాతానికి తగ్గించిందని తెలిపారు. రైతులకు లాభదాయకంగా ఉంటేనే పామాయిల్ సాగుకు ముందుకొస్తారని, కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని తగ్గించడం బాధాకరమని తుమ్మల పేర్కొన్నారు. దిగుమతి సుంకాన్ని పెంచాలని నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు.

## రాజాసింగ్‌పై బీజేపీ సీరియస్!



హైదరాబాద్, (సందేశం టైమ్స్)జూలై 3: పార్టీ రాష్ట్ర ముఖ్యులపై ఆరోపణలు గుప్పిస్తూ, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై అనర్హత వేటు వేయాలని అసెంబ్లీ స్పీకర్‌ను కోరేందుకు బీజేపీ సిద్ధమవుతున్నట్టు తెలిసింది. ఈ మేరకు ప్రత్యేకంగా లేఖ రాయనున్నట్టు సమాచారం. గతంలో పలుమార్లు పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించిన సందర్భాల్లో రాజాసింగ్‌ను క్షమించినా, ఇప్పుడు కఠిన నిర్ణయం తీసుకోవాలని జాతీయ నాయకత్వం భావిస్తున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. "రాష్ట్ర పార్టీ అధ్యక్ష పదవికి పోటీచేసేందుకు రాజాసింగ్‌కు నామినేషన్ పత్రం ఇచ్చినా.. ఆయన దాఖలు చేయకపోగా, పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఆరోపణలు చేశారు. దీనిని జాతీయ నాయకత్వం సీరియస్‌గా తీసుకుంది. ఆయన రాజీనామాను ఆమోదిస్తూనే ఎమ్మెల్యేగా అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను కోరాలని నిర్ణయించింది" అని వెల్లడించాయి. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు రాజాసింగ్ సన్నిహితంగా ఉంటారని, గతంలో రాజాసింగ్‌ను పార్టీ నాయకత్వం సస్పెండ్ చేస్తే ఎత్తి వేయించేందుకు రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో సంజయ్ ప్రయత్నించారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈసారి సంజయ్ చెప్పినా వినకుండా రాజాసింగ్ రాజీనామా చేశారని పేర్కొన్నాయి

## కేసీఆర్‌కు అస్వస్థత

**వారం నుంచి తీవ్ర జ్వరం, జలుబు, దగ్గు, తలనొప్పితో ఇబ్బంది**

**యశోద ఆస్పత్రిలో చికిత్స కేసీఆర్**

**త్వరగా కోలుకోవాలని సీఎం రేవంత్, బండి సంజయ్ ఆకాంక్ష**

హైదరాబాద్,(సందేశం టైమ్స్)జూలై 3: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అస్వస్థతకు గురయ్యారు. వారం రోజులుగా తీవ్ర జ్వరం, జలుబు, దగ్గు, తలనొప్పితో బాధపడుతున్న ఆయన గురువారం సోమాజిగూడలోని యశోద ఆస్పత్రిలో చేరారు. ఆస్పత్రి భవనం తొమ్మిదో అంతస్తుల్లోని ప్రత్యేక గదిలో ఆయనకు ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్, సీనియర్ జనరల్ ఫిజిషియన్ డాక్టర్ ఎంవీ రావు పర్యవేక్షణలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. తొలుత కేసీఆర్ ఎర్రవల్లిలోని తన ఫామ్‌హౌస్ నుంచి కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్ నందినగర్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. అక్కడి నుంచి సతీమణి శోభ, కేటీఆర్, శైలిమ, హరీశ్, సంతోష్‌తో కలిసి ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ వైద్యులు కేసీఆర్‌కు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు.

## వరద జలాల లెక్క ఎలా?

**పోలవరం-బనకచర్లపై ఏపీకి కేంద్ర జలసంఘం ప్రశ్న**

**సాధ్యాసాధ్యాల రిపోర్టుపై అధ్యయనం**

**పరిశీలనలు, అభిప్రాయాలతో ఏపీ ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక**

అమరావతి, (సందేశం టైమ్స్)జూలై 3: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పోలవరం–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) పలు వివరాలు, గణాంకాలు సమర్పించాలని కోరింది. వరద జలాల ఆధారంగా ఈ పథకాన్ని తలపెట్టినందున.. అసలు వరద జలాల నిర్వచనమేంటో చెప్పాలని, వాటిని ఎలా లెక్కిస్తారో వివరించాలని రాష్ట్రానికి సూచించింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ముందస్తు సాధ్యాసాధ్యాల నివేదిక (పీఎఫ్ఆర్)ను రాష్ట్రప్రభుత్వం మే 26న జలసంఘానికి నివేదించిన సంగతి తెలిసిందే. దీనిని పరిశీలించిన జలసంఘం.. తన పరిశీలనలు, అభిప్రాయాలతో ప్రాథమిక నివేదికను నాలుగు రోజుల కిందట (గత నెల 30న) రాష్ట్రానికి పంపింది. అదే రోజు కేంద్ర పర్యావరణ–అటవీ మంత్రిత్వ శాఖకు చెందిన నిపుణుల మదింపు కమిటీ (ఈఏసీ) ఢిల్లీలో ఈ ప్రాజెక్టుపై కొర్రీలు వేసి ప్రతిపాదనను వెనక్కి పంపడం గమనార్హం. గోదావరికి వరద సమయంలో రోజుకు 2 టీఎంసీల చొప్పున వంద రోజుల్లో 200 టీఎంసీలను పోలవరం నుంచి బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌కు తరలించాలన్నది ఈ ప్రాజెక్టు ఉద్దేశమన్న సంగతి తెలిసిందే.

# రైతులంతా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

## ఏఈఓ అన్వేష్



(సందేశం టైమ్స్)జూలై 3: రైతులు అందరూ తమయొక్క పట్టాదారు పాసుబుక్ ఆధార్ కార్డు మరియు ఫోన్ నెంబర్ తీసుకొని వచ్చి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి అన్వేష్ తెలిపారు ఈరోజు అనంతగిరి మండలం వాయిలసింగవరం గ్రామంలో గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవడం వలన కేంద్ర ప్రభుత్వ పథకాలు అయిన ఫసల్ భీమా యోజన పంటల భీమా పథకం తదితర కేంద్ర ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని ఆయన తెలిపారు ఇట్టికార్యక్రమంలో రైతులు కొల్లు సుబ్బారావు గద్దె రామారావు నేరెళ్ళ ముత్తారావు బుర్రా సైదులు రేపూరి శ్రీను అక్కినపల్లి వెంకటేశ్వర్లు మలికంటి మట్టయ్యచిప్పల కనకయ్య మల్సూరు బిక్షం శ్రీను తదితరులు పాల్గొన్నారు

# వర్షాలు కురవడంతో ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



సందేశం టైమ్స్ (జూలై 3) ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గం లోని రైతులు చేనులలో పత్తి వేయడం వలన వర్షాలు పడకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. గత 15 రోజులుగా వర్షాలు పడకపోవడంతో పంటలు ఏమైతాయో అని రైతులు వారి ఆవేదనను వ్యక్తపరచుకున్నారు . గత రెండు మూడు రోజుల నుండి వర్షాలు కురవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు వేసిన పత్తి పంట కు వర్షాలు కురవడంతో వారు సంతోషించారు మరియు వర్షాలు పడడం వలన రైతులు ఆనందాన్ని వ్యక్తపరుస్తున్నారు

# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**పెండింగ్లో ఉన్న 7200 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలి**

**పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం చందర్ రావు, పివైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి రవి**





(సందేశం టైమ్స్)జూలై 3: ఇంజనీరింగ్ డిగ్రీ, పీజీ విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్ధకంగా మారుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్ మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్యు) ఆధ్వర్యంలో కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల నుండి ఆర్డిఓ కార్యాలయం వరకు భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించి ఆర్డిఓకు వినతి పత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం చందర్ రావు, పివైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి రవి పాల్గొని మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకపోవడం వలన విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు వారి మేనిఫెస్టోలో విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తామని విద్యార్థులకు అండదండగా ఉంటామని చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలలు గడుస్తున్న విద్యార్థుల ఫీజు రియంబర్స్ మెంట్ గురించి కనీసం మాట్లాడే పరిస్థితి కూడా లేదని వారు అన్నారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థుల గురించి చూసి చూడనట్లు వివరించడం మూలంగా విద్యార్థులు యువకులు కలిసి టిఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పారు నేడు అదే విధానాలు కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూడా విద్యార్థి యువకులు కలిసి రేపు జరగబోయే స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పే పరిస్థితి ఏర్పడుతుందని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు. విద్యార్థులకు రావాల్సినటువంటి 7200 కోట్ల రూపాయలను విడుదల చేయకుండా అందాల పోటీలకు 200 కోట్లు ఖర్చు పెట్టడానికి నిధులు ఎక్కడి నుంచి వచ్చాయని వారు ప్రశ్నించారు. వెంటనే పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్ మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు డివిజన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కామల్ల ఉదయ్, పులి రాఖి, జిల్లా నాయకులు డి వేణు, పిడిఎస్యు డివిజన్ నాయకులు గుండు ఉమేష్, బి యశ్వంత్, నూనె కళ్యాణ్, రాము, విద్యార్థినీ విద్యార్థులు రమ్య, శైలజ, స్పందన, సులోచన, సాహితీ, శ్రీదేవి, తదితర కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ హెల్పర్లకు సర్కారు శుభవార్త

**టీచర్లుగా పదోన్నతికి గరిష్ఠ వయోపరిమితి 50 ఏళ్లకు పెంపు**

**ఫైలుపై మంత్రి సీతక్క సంతకం.. త్వరలో ఉత్తర్వులు**

**దీంతో 4,322 మంది అంగన్వాడీ హెల్పర్లకు టీచర్లుగా పదోన్నతి**





హైదరాబాద్, (సందేశం టైమ్స్)జూలై 3:అంగన్వాడీ హెల్పర్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారు అంగన్వాడీ టీచర్లుగా పదోన్నతి పొందేందుకు గరిష్ఠ వయోపరిమితిని 45ఏళ్ల నుంచి 50ఏళ్లకు పెంచుతూ మహిళా శిశు సంక్షేమశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈమేరకు ఆ శాఖ మంత్రి సీతక్క సంబంధిత ఫైలుపై గురువారం సంతకం చేశారు. ఇటీవలే అంగన్వాడీ టీచర్ల రిటైర్మెంట్ వయసును 60 నుంచి 65 ఏళ్లకు పెంచారు. ఈ నేపథ్యంలో 50 ఏళ్ల వయసులో టీచర్గా పదోన్నతి పొందే హెల్పర్లు 15 ఏళ్లు విధులు నిర్వర్తించే అవకాశం ఉండనుంది. ప్రభుత్వ నిర్ణయానికి సంబంధించి త్వరలో అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి.

సర్కారు తాజా నిర్ణయంతో 45 ఏళ్లు దాటిన 4,322 మంది అంగన్వాడీ హెల్పర్లకు టీచర్లుగా పదోన్నతి దక్కనుంది. మరోవైపు అంగన్వాడీ కేంద్రాల్లో ఉద్యోగ ఖాళీల భర్తీ, కారుణ్య నియామకాలను త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని మంత్రి సీతక్క ఆదేశించారు. గురువారం సచివాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, ఆ శాఖ డైరెక్టర్ సృజన, సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్, తెలంగాణ ఫుడ్స్ ఎండీ చంద్రశేఖర్రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అంగన్వాడీల బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. చిన్నారుల్లో పోషకాహార మెరుగుదల పరిశీలనకు ప్రోగ్రెస్ రిపోర్ట్ విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. వారికి అందించే ఆహారంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించేలా వంద రోజులపాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఎస్హెచ్జీలకు ఆర్టీసీ ద్వారా రూ.కోటి చెల్లింపు

ఆర్టీసీకి అప్పగించిన అద్దె బస్సుల ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలు (ఎస్హెచ్జీ) రూ.కోటి ఆర్జించాయని మంత్రి సీతక్క తెలిపారు. అద్దె ప్రాతిపదికన ఎస్హెచ్జీలు 150 బస్సులను ఆర్టీసీకి అప్పగించాయని, ఒక్కో బస్సుకు ఆర్టీసీ ప్రతి నెలా రూ.70 వేలు చెల్లిస్తోందన్నారు. మొదటి నెల అద్దెకు సంబంధించిన రూ.కోటి 5 లక్షల చెక్కును ఆర్టీసీ యాజమాన్యం సెర్ప్ సీఈవోకు అందజేసిందని తెలిపారు. ఎస్హెచ్జీలకు ఈ నెల 5న ప్రజాభవన్లో చెక్కులను పంపిణీ చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

# బనకచర్లపై రాహుల్ మౌనం కుట్రపూరితమే!



హైదరాబాద్,(సందేశం టైమ్స్)జూలై 3: బనకచర్ల ప్రాజెక్టు అంశంపై రాహుల్ గాంధీ మౌనంగా ఉండటం కుట్రపూరితమేనని, తెలంగాణకు ద్రోహం చేసేందుకు ఆయన బీజేపీతో కలిసి పనిచేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఎంతపెరిగినా గొర్రెకు బెత్తడేతోక అన్నట్లు ప్రతిపక్షనేతగా రాహుల్ ఏడాదికాలంగా సాధించింది ఏమీలేదని ఎక్స్వేదికగా ఆయన ఎద్దేవా చేశారు.గోదావరిలో తెలంగాణకు న్యాయంగా రావాల్సిన వాటాను చంద్రబాబుకు రేవంత్రెడ్డి ధారాదత్తం చేస్తుంటే ఆపకుండా రాహుల్తోపాటు కాంగ్రెస్ అగ్రనాయకులు తీరని అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. 2014 పునర్విభజన చట్టం హామీల అమలుపై ప్రతిపక్షనేత హోదాలో రాహుల్ కేంద్ర ప్రభుత్వాన్ని ఇప్పటివరకు ప్రశ్నించలేదని కేటీఆర్ గుర్తుచేశారు.

# క్యాబినెట్లో చోటు కల్పించండి!





హైదరాబాద్, (సందేశం టైమ్స్)జూలై 3: మంత్రి వర్గ విస్తరణలో చోటు కోసం చివరి దాకా పోటీ పడిన పలువురు ఎమ్మెల్యేలు ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో సమావేశమయ్యారు. తమకు ఉన్న అర్హతలను వివరించడంతోపాటు పార్టీకి చేసిన సేవలను గుర్తుచేశారు. ఎమ్మెల్యేలు ప్రేమ్సాగర్రావు, సుదర్శన్రెడ్డి, మల్రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్రెడ్డి, బాలూ నాయక్.. ఖర్గేతో ముఖాముఖి భేటీ కాగా, అందరి అభిప్రాయాలను ఆయన సావధానంగా విన్నారు. రెండు దశాబ్దాలుగా ఆదిలాబాద్ జిల్లాలో పార్టీని బతికించుకుంటూ వస్తున్నానని ప్రేమ్సాగర్రావు వివరించారు. పార్టీ కోసం దగ్గరి బంధువులతోనూ శత్రుత్వం పెంచుకోవాల్సి వచ్చిందని ఖర్గే దృష్టికి తెచ్చారు. రేవంత్రెడ్డి పీసీసీ చీఫ్గా ఉన్నప్పుడు.. ఇంద్రవెల్లి సభ సందర్భంగా తనకు హామీ కూడా ఇచ్చారని చెప్పినట్లు సమాచారం. తనకు కాకుండా ఎన్నికల ముందు పార్టీలోకి వచ్చిన వారికి మంత్రివర్గంలో చోటు కల్పించారంటూ అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. మరోవైపు.. రాష్ట్రంలో సగం జనాభా హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో ఉంటే.. రెండు జిల్లాలకు కలిపి ఒక్క మంత్రి పదవి కూడా లేదని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.ఇది ప్రజల్లోకి తప్పుడు సంకేతాలను పంపుతుందని ఖర్గే దృష్టికి తెచ్చారు. అర్బన్ ప్రాంతాల్లో బీజేపీ బలం పుంజుకుంటోందని, లోక్సభ ఎన్నికలే దీనికి ఉదాహరణ అని చెప్పారు. ఇచ్చిన జిల్లాకే మళ్లీ మంత్రి పదవి ఇవ్వడమూ సరికాదని, ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు ప్రాతినిథ్యం కల్పించాలని కోరారు. మంత్రి కావడానికి తనకు ఉన్న అర్హతలను వివరించారు. ఇదిలా ఉంటే పార్టీలో సీనియర్గా తనకు అవకాశం కల్పించాలని సుదర్శన్రెడ్డి కోరారు. మంత్రివర్గంలో బంజారాలకు అన్యాయం జరిగిందంటూ ఖర్గేకు బాలూ నాయక్ ఫిర్యాదు చేశారు. బంజారాల్లో 80శాతం మంది కాంగ్రెసకే మద్దతుగా నిలిచారని,అయినా న్యాయం జరగలేదన్నారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్రెడ్డి.. తాను మంత్రి పదవికి ఏ విధంగా అర్హుడినో వివరిస్తూ ఖర్గేకు నివేదికను అందించారు.

# వ్యక్తి దారుణ హత్య

**అర్ధరాత్రి వ్యక్తి దారుణ హత్య**


**మారుణ ఆయుధంతో తలపై కొట్టి హత్య చేసి గుమ్మం ముందు పడేసిన గుర్తుతెలియని దుండగులు**





సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 3జులై సంగారెడ్డి జిల్లా: పెద్ద శంకరంపేట మండలంలో వ్యక్తులు వ్యక్తిని దారుణంగా హత్య చేసి పరారైన దుండగులు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కమలాపురం గ్రామానికి చెందిన సుధాకర్ (38) ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. గురువారం ఉదయం తన ఇంట్లో గుమ్మం ముందు తలకు బలమైన గాయమై రక్తపు మడుగులతో ఉన్న సుధాకర్ మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న అల్లాదుర్గం సర్కిల్ సిఐ రేణుక రెడ్డి, స్థానిక ఎస్సై ప్రవీణ్ రెడ్డి ఘటన స్థలాన్ని చేరుకొని విచారణ చేపట్టారు. క్లూ టీమ్, డాగ్స్ స్కాడ్ సహాయంతో ఆధారాలను సేకరిస్తున్నారు. మృతుడికి ఒక కూతురు, ఒక కొడుకు ఉన్నారు. గత రెండు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో భార్య చనిపోయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హత్య చేసి పరారైన గుర్తు తెలియని దుండగుల కోసం పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నారు. మృతుని తల్లి తోట మానెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ రెడ్డి తెలిపారు. వ్యక్తిని శవాన్ని %ాపీజు% కొరకు సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హత్య చేసే కార్యాలైన గుర్తు తెలియని దున్నపోతుల కోసం పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నారు.

# తెలంగాణకు కాళేశ్వరమే శ్రీరామరక్ష



(సందేశం టైమ్స్) : తెలంగాణకు కాళేశ్వరమే శ్రీరామరక్ష. ఈ ప్రాజెక్టుపై జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అక్కసు వెళ్లగక్కారు. 'ఏ కోణంలోనూ కాళేశ్వరాన్ని సమర్థించలేం' పేరుతో జూలై 2న లో ప్రచురితమైన వ్యాసంలో ప్రాజెక్టు గురించి ఆయన అనేక అసత్యాలు రాశారు. జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఓ రాజకీయ పునరావాస కేంద్రంగా మారడం దురదృష్టకరం.తెలంగాణ రాష్ట్రం కృష్ణా, గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలంటే ఎత్తిపోతలు తప్ప మరో మార్గం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 'తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల వరకు గోదావరి జలాలను తరలిస్తా'మని చెబుతూ 'ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల ప్రాజెక్టు'ను ప్రతిపాదించింది. 2014 వరకు కేంద్రంలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీయే అధికారంలో ఉన్నా తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. ప్రధానమైన హెడ్ వర్క్స్ పనుల్లో తట్ట మట్టి కూడా తీయకుండానే కాంట్రాక్టర్లకు రూ. వేల కోట్ల మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు ఇచ్చి ఫక్తు కమీషన్ల ప్రాజెక్టుగా మార్చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కేసీఆర్ 152 మీటర్ల ఎత్తులో తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి అనేక ప్రయత్నాలు చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారు. 148 మీటర్ల ఎత్తులో మాత్రమే బ్యారేజీ నిర్మాణానికి ఒప్పుకుంటామని మహారాష్ట్ర స్పష్టం చేసింది. తుమ్మిడిహెట్టి వద్ద 165 టీఎంసీల నికర జలాల లభ్యత ఉన్నా అందులో ఛత్తీస్‌గఢ్ వినియోగించుకోని 63 టీఎంసీలు కూడా ఉన్నాయనే విషయాన్ని సీడబ్ల్యూసీ ఎత్తిచూపింది. 165 టీఎంసీల నీటిని వినియోగించే ప్రాజెక్టులో కేవలం 16 టీఎంసీల రిజర్వాయర్లు మాత్రమే ప్రతిపాదించడాన్ని కూడా తప్పుబట్టింది. వీటన్నింటికీ మించి వైన్‌గంగా, వార్ధ నదుల సంగమం తర్వాత ప్రాణహిత నది ప్రవాహం మొదలవుతుంది. అదే ప్రాంతంలో తుమ్మిడిహెట్టి బ్యారేజీని ప్రతిపాదించారు. తుమ్మిడిహెట్టి వద్ద మహారాష్ట్ర వైపున నదీ ప్రవాహం 40 డిగ్రీల కోణంలో వంపు తిరిగి ఉ ంటుంది. ఆ ప్రదేశంలో బ్యారేజీ నిర్మాణానికి సాంకేతికంగా ఎన్నో అవాంతరాలు ఉన్నాయి. ఫలితంగానే కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యామ్నాయాల వైపు చూడాల్సి వచ్చింది. నిపుణుల కమిటీ మేడిగడ్డను వ్యతిరేకించింది అనేది పచ్చి అబద్ధం. మేడిగడ్డ నుంచి నేరుగా మిడ్ మానేరుకు నీటిని తరలించాలన్న ప్రతిపాదనను మాత్రమే నిపుణుల కమిటీ వద్దని చెప్పింది. మేడిగడ్డ వద్ద 240 టీఎంసీలకు పైగా నికర జలాల లభ్యత ఉందని సీడబ్ల్యూసీ నిర్ధారించింది. అందుకే ప్రాజెక్టు సోర్స్ పాయింట్‌ను తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు కేసీఆర్ ప్రభుత్వం మార్చాల్సి వచ్చింది. ప్రాణహిత%-%చేవెళ్లకు అన్ని అనుమతులు వచ్చినట్టు వ్యాసకర్త రాశారు. అది కూడా తప్పే. ప్రాణహిత ప్రాజెక్టుకు కొన్ని అనుమతులు వచ్చిన మాట నిజమే అయినా కాళేశ్వరం ప్రాజెక్టుగా రీ డిజైన్ చేసిన తర్వాతనే కేంద్రం నుంచి అన్ని అనుమతులు సాధించారనేది వాస్తవం. కాళేశ్వరం ప్రాజెక్టుతో ప్రయోజనమే లేదని చెప్పడానికి వ్యాసకర్త ప్రయత్నించారు. 20 లక్షల ఎకరాలకు పైగా భూములకు ఈ ప్రాజెక్టు ద్వారా నీళ్లిచ్చారని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారికంగా ప్రకటించింది. ఈ వాస్తవాన్ని తొక్కిపెట్టి కాళేశ్వరంపై వ్యాసకర్త విషం చిమ్మారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై 100 రూపాయలు ఖర్చు చేస్తే 52 రూపాయల ఆదాయం మాత్రమే వస్తుంది కాబట్టి ఈ ప్రాజెక్టు లాభసాటి కాదు అని వ్యాసకర్త తెలిపారు. విద్య, వైద్యం, రైతులు, మహిళల సంక్షేమం కోసం చేసే ఖర్చును లాభనష్టాల కోణంలో చూడటమే తప్పు. ప్రజా సంక్షేమం ప్రభుత్వాల విధ్యుక్త ధర్మం. రాష్ట్రానికి హక్కుగా దక్కే నదీజలాలను ఒడిసిపట్టేందుకు ఎంత ఖర్చుకైనా వెనుకాడొద్దు అనే వాస్తవాన్ని గుర్తించాలి. ఏపీ ప్రభుత్వం రూ.82 వేల కోట్లతో తలపెట్టిన గోదావరి- బనకచర్ల లింక్ ప్రాజెక్టు కింద ఒక్క ఎకరా అయినా కొత్త ఆయకట్టు ఉందా అన్న విషయం కాళేశ్వరం ప్రాజెక్టును వ్యతిరేకించే వాళ్లు గుర్తించాలి.20 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు ఇచ్చే, మరో 20 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించే కాళేశ్వరం ప్రాజెక్టును సమర్థించలేమని వ్యాసకర్త అంటున్నారు. అంటే ఏపీ ప్రభుత్వం జలదోపిడీ కోసం ప్రతిపాదించిన బనకచర్ల ప్రాజెక్టుకు ఆయన వంత పాడుతున్నట్లుగా భావించాల్సి ఉంటుంది. వ్యాసకర్త తన రాజకీయ బాస్‌ను మెప్పించడానికి ఈ ప్రయత్నం చేసినట్టుగా అనిపిస్తోంది. ప్రపంచ దేశాల్లో నిర్మించిన భారీ ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ లాభాల సాధన కోసం మాత్రమే కాదు. ఆయా దేశాలు, రాష్ట్రాల నీటి హక్కులు కాపాడుకోవడంతో పాటు అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించుకోవడానికి అన్న వాస్తవాన్ని అంగీకరించాలి. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం ఇకపై నిధులు వినియోగిస్తే ఆ వ్యయం కూడా వృథా అనే తప్పుడు సూత్రీకరణలకు ఇకనైనా ఫుల్‌స్టాప్ పెట్టాలి. గోదావరి నదిలో మనకు హక్కుగా దక్కే నీటిలో అతి ఎక్కువ నీటిని వినియోగించుకునే అవకాశం ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టుతోనే ఉన్నది. ఈ ప్రాజెక్టును పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలి. కాళేశ్వరమే తెలంగాణకు శ్రీరామరక్ష. కాళేశ్వరమే తెలంగాణకు లైఫ్ లైన్.

## నడవలేని స్థితిలో ఉన్న రైతు వద్దకు వచ్చి సమస్యను తెలుసుకున్న తహసీల్దార్




దిలావర్‌పూర్,(సందేశం టైమ్స్) : ప్రభుత్వ అధికారుల్లో మానవత్వం ఉంటుందని నిరూపించారు నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ తహసీల్దార్. అనేక అనారోగ్య సమస్యలతో కొట్టుమిట్టాడుతూ నడవలేని స్థితిలో తన భూమి సమస్యను విన్నవించేందుకు లోలం గ్రామానికి చెందిన కన్న ముత్తన్న అనే రైతు ఆటోలో తహసీల్ కార్యాలయానికి వచ్చాడు. తన సమస్యను చెప్పుకునేందుకు కార్యాలయంలోనికి నడిచి వెళ్లేందుకు చేతకాకపోవడంతో ఆటోలోనే కూర్చుండిపోయాడు.ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్ స్వయాన రైతు వద్దకు వెళ్లి సమస్యను తెలుసుకున్నారు. రైతు చెప్పిన విషయాలను తెలుసుకుని సంబంధిత కింది స్థాయి అధికారుల ద్వారా రికార్డులను తెప్పించి పరిశీలించారు. రైతు ద్వారా పూర్తి సమాచారాన్ని తీసుకుని సమస్య పరిష్కారానికి హామీ ఇవ్వడంతో రైతు సంతోషంగా వెనుదిరిగారు.

## పెన్‌పహాడ్ పీహెచ్‌సీ అపరిశుభ్రతపై ఆరోగ్య అధికారి ఆగ్రహం



పెన్‌పహాడ్, (సందేశం టైమ్స్) : సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అపరిశుభ్రతపై జిల్లా ఆరోగ్య అధికారి పి.చంద్రశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది హాజరును పరిశీలించారు. దవాఖానాలో అవసరమైన మందులు, ఇంజక్షన్లు, వివిధ వైద్య సామగ్రి సరిపడా ఉన్నాయా లేవా అని మండల వైద్యాధికారి డాక్టర్ స్రవంతిని అడిగి తెలుసుకున్నారు. దవాఖాన ఆవరణంలో ఎక్కడి చెత్త అక్కడే, ఎక్కడి వస్తువులు అక్కడే ఉండడంతో డాక్టర్ స్రవంతిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజలకు వ్యాధులు నయం చేసే ఆస్పత్రే పరిశుభ్రంగా లేకుంటే వైద్య సేవలు ఎలా అందిస్తారని ప్రశ్నించారు. ఆరోగ్య కేంద్రాన్ని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గర్భిణీలు, పిల్లలు, ఇతర రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వ్యాక్సినేషన్ ప్రక్రియను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ఆస్పత్రిలో ప్రసవాల వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా దవాఖాన సిబ్బందికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంపై సూచనలు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పులు, రికార్డులు నిర్వహణ అంశాలపై ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, రాజు, భూతరాజు శ్రీనివాస్, భూతరాజు సైదులు పాల్గొన్నారు.

## నిధులు గోల్‌మాల్

మంచిర్యాల,(సందేశం టైమ్స్) : జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ కాలనీలో ఉన్న 'మంచిర్యాల క్లబ్' లో పెద్ద మొత్తంలో నిధులు గోల్‌మాల్ అయినట్లు తెలుస్తోంది. రిక్రియేషన్ పేరిట నిర్వహిస్తున్న క్లబ్‌లో పేకాటే ప్రధానంగా కార్యకలాపాలు సాగుతుండగా, జిమ్, స్విమ్మింగ్ పూల్, షటిల్ కోర్టు కూడా అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ సభ్యత్వం పొందాలంటే పెద్దమొత్తంలో సభ్యత్వ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. క్లబ్‌కు అనుసంధానంగా బార్ కూడా ఉండటంతో పేకాట ఆడుతూ మద్యం సేవించడం ఇక్కడ అనవాయితీగా వస్తోంది. ఇందులో రాజకీయ ప్రముఖులు, ప్రభుత్వ ఉద్యోగులు, రియల్ ఎస్టేట్, వడ్డీ వ్యాపారులు సభ్యులుగా ఉన్నారు. ఇక్కడ పేకాట నిత్యకృత్యమన్న విషయం రామగుండం కమిషనరేట్ పోలీసుల దాడుల్లో వెల్లడైంది.

## కొవిడ్ టీకాలు సురక్షితమైనవి : సీరమ్ ఇన్‌స్టిట్యూట్




(సందేశం టైమ్స్) దేశంలో పలు చోట్ల చోటుచేసుకున్న గుండెపోటు, ఇతర హృద్రోగ సంబంధ మరణాలకు కొవిడ్ వ్యాక్సినే కారణమంటూ ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే . ఈ విషయంపై కొవిషీల్డ్ తయారీ సంస్థ సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా తాజాగా స్పందించింది. టీకా, గుండె సంబంధిత మరణాల మధ్య ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు భారత వైద్య పరిశోధనా మండలి, ఎయిమ్స్ సంయుక్తంగా చేపట్టిన అధ్యయనాన్ని ఊటంకిస్తూ.. 'టీకాలు సురక్షితమైనవి, శాస్త్రీయంగా ధృవీకరించబడ్డాయి' అని స్పష్టం చేసింది.దేశంలో పలు చోట్ల చోటుచేసుకున్న గుండెపోటు, ఇతర హృద్రోగ సంబంధ మరణాలకు కొవిడ్ వ్యాక్సిన్‌కు ఎలాంటి సంబంధం లేదని కేంద్రం బుధవారం స్పష్టం చేసిన విషయం తెలిసిందే. కర్ణాటకలోని హసన్ జిల్లాలో నెల రోజుల వ్యవధిలో 20 మంది గుండె సంబంధ సమస్యలతో మరణించడానికి కొవిడ్ వ్యాక్సినే కారణమంటూ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించిన క్రమంలో కేంద్రం వివరణ ఇచ్చింది. ఇటీవల కర్ణాటకలోని హాసన్ జిల్లాలో పలువురు యువకులు హార్ట్ ఎటాక్‌తో మరణించారు. దీనిపై సీఎం సిద్ధరామయ్య స్పందిస్తూ.. కొవిడ్ టీకాను వేగంగా పంపిణీ చేయడం వల్లే అది జరుగుతుండొచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. చెస్ట్‌లో నొప్పి, ఊపిరాడకపోవడం వంటి లక్షణాలుంటే నిర్లక్ష్యం చేయకుండా దగ్గరలోని ఆసుపత్రిలో వెంటనే పరీక్షలు చేయించుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.సీఎం ఆరోపణలతో ఆకస్మిక మరణాలకు కొవిడ్ టీకాలే కారణమంటూ సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్), ఢిల్లీ ఎయిమ్స్ సంయుక్తంగా లోతైన అధ్యయనాన్ని చేపట్టాయి. ఈ పరిశోధనలో భాగంగా కొవిడ్ నుంచి కోలుకున్న తర్వాత మరణించిన పలు కేసులను శాస్త్రవేత్తలు క్షుణ్ణంగా విశ్లేషించారు. వారి ఆరోగ్య నేపథ్యం, వ్యాక్సినేషన్ వివరాలు, ఇతర వైద్య సంబంధిత అంశాలను పరిశీలించారు. ఈ అధ్యయనంలో ఆకస్మిక మరణాలకు ప్రధాన కారణం బాధితులకు ముందు నుంచే ఉన్న అనారోగ్య సమస్యలే అని తేలింది. దాదాపు నెలరోజులపాటూ జరిపిన ఈ అధ్యయనంలో జన్యుపరమైన లోపాలు, తీవ్రమైన అనారోగ్య సమస్యలే కారణమని నిర్ధరణ అయ్యింది. వ్యాక్సిన్ల వల్ల కలిగే దుష్ప్రభావాల కారణంగా ఈ మరణాలు సంభవిస్తున్నాయనడానికి ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లభించలేదని నివేదిక పేర్కొంది.

# విశాఖ నుంచి బయలుదేరిన ఎంవి ఎంప్రెస్ నౌక



ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం) (సందేశం టైమ్స్) : చెన్నై – పుదుచ్చేరి – విశాఖపట్నం మధ్య తిరిగే విలాసవం తమైన క్రూయిజ్ లైనర్ ఎంవి.ఎంప్రెస్ నౌక బుధవారం ఉదయం 1200 మంది పర్యాటకులతో విశాఖపట్నం చేరుకుంది. తిరుగు ప్రయాణంలో సాయంత్రం విశాఖ నుంచి మరో 600 మంది పర్యాటకులను కలుపుకొని బయలుదేరింది. ఈ నౌక గురువారం ఉదయం పుదుచ్చేరి చేరుకొని మరలా సాయంత్రం పుదుచ్చేరి నుండి బయలుదేరి మరుసటి రోజు శుక్రవారం ఉదయం చెన్నై చేరుకుంటుంది. అదేవిధంగా తిరుగు దశలో శుక్రవారం రాత్రి చెన్నై నుంచి బయలుదేరి శనివారం సాయంత్రానికి విశాఖపట్నం చేరుకుంటుంది. చెన్నై – పుదుచ్చేరి విశాఖపట్నం మధ్య జులై నెలలో రెండుసార్లు, ఆగస్టు నెలలో ఒకసారి పర్యటించేందుకు ఒప్పందం కుదిరిందని, అక్టోబర్ అనంతరం తరచూ విశాఖపట్నం వచ్చేలా ఆ సంస్థతో చర్చలు జరుపుతున్నామని పోర్టు చైర్మన్ డాక్టర్ అంగముత్తు తెలిపారు. విశాఖపట్నం పోర్ట్ అథారిటీ, జిల్లా పాలనా యంత్రాంగం సంయుక్తంగా ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. వర్చువల్‌గా క్రూయిజ్ షిప్‌ను కేంద్ర పోర్టు నౌకా జలరవాణా శాఖమంత్రి శర్బానంద సోనోవాల్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యాటక అభివృద్ధి, ఆర్థిక ప్రగతిలో విశాఖపట్నం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కేంద్ర పోర్టులు నౌకా జలరవాణా శాఖ సహాయ మంత్రి శంతను ఠాకూర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా క్రూయిజ్ టూరిజాన్ని అభివృద్ధి పరచడంలో కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ క్రూయిజ్ టూరిజం చరిత్రలో ఒక చారిత్రక ఘట్టమని కేంద్ర పోర్టు నౌకా జలరవాణా షాఖ కార్యదర్శి టికె.రామచంద్రన్ అన్నారు ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న రాష్ట్ర పర్యటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక సర్క్యూట్లు, హబ్‌లను అభివృద్ధి చేయడంపై చర్యలు చేపట్టిందని వెల్లడించారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజరు జైన్ మాట్లాడుతూ ఇది స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయగలదని, మారిటైం ఇండియా విజన్‌కు అనుగుణంగా ఉ ందని తెలియజేశారు. విశాఖ పోర్టు చైర్మన్ ఎం.అంగముత్తు మాట్లాడుతూ క్రూయిజ్ టూరిజం అభివృద్ధి లక్ష్యాన్ని గుర్తుచేస్తూ, ముఖ్యమంత్రి ఆలోచన ప్రకారం ప్రతి 50 కిలోమీటర్లకు ఒక సముద్ర సంబంధిత కేంద్రంగా, షిప్ బిల్డింగ్, స్కిల్ డెవలప్‌మెంట్, కోస్టల్ లేదా క్రూయిజ్ టూరిజం కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రతి సంవత్సరం 5,000 మంది విద్యార్థులకు క్రూయిజ్ ఆధారిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కల్పించి, వారిని ఉపాధి అవకాశాలకు సిద్ధం చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా ఎంవి.ఎంప్రెస్ షిప్‌లో ప్రయాణించే కుటుంబాలకు బోర్డింగ్ పాస్‌లు అందజేశారు. ఈ కార్యక్రమానికి విశాఖపట్నం ఎంపి ఎం.శ్రీ భరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, విశాఖ జిల్లా కలెక్టర్ ఎం హరేంధిర ప్రసాద్ హాజరయ్యారు.

# పొగాకు కొనుగోలు వేగవంతం చేయండి

## సమాచారాన్ని రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించాలి
## సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు రమాదేవి



పర్చూరు,(సందేశం టైమ్స్) : నల్లబర్లీ పొగాకు కొనుగోలును వేగవంతం చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి కోరారు. మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాల నుంచి సరైన సమాచారం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పర్చూరు ఎఎంసిలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని రైతు సంఘం నాయకులతో కలిసి బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ చిన్న, సన్న కారు రైతులకు సంబంధించిన పొగాకును ముందుగా కొనుగోలు చేయాలన్నారు. తమ ఫోన్‌కు వచ్చిన మెసేజ్‌లు చూసుకోవడంలో రైతులు ఇబ్బందులు పడుతు న్నారని, ఏ రోజు ఏ రైతు సరుకును కొనుగోలు చేస్తారో ఆ వివరాలను ముందుగానే ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సమాచారం అందుబాటులో ఉంచాలని కోరారు. ఆ సమాచారాన్ని వ్యవసాయ సిబ్బంది ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేయాలన్నారు. క్వింటాలు రూ.6,000, రూ 9000, రూ.12000 చొప్పున గ్రేడుల ప్రకారం కొనుగోలు చేస్తున్నారని, నిర్ణయించిన ధర ప్రకారం క్వింటాలు రూ.12 వేలకు కొనుగోలు చేయడం లేదని అన్నారు. వివిధ కారణాలు చూపి ఎక్కువ బేళ్లను రూ.6000కు కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రయివేట్ కంపెనీలు ఏ రోజున ఎంత మొత్తంలో రైతులు నుంచి పొగాకు కొనుగోలు చేస్తాయో రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించాలని కోరారు. సరైన సమాచారం లేక దుద్దుకూరుకు చెందిన ఓ రైతు తన సరుకును కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చారని, అయితే పొగాకు కొనుగోలు చేయకపోవడంతో ఆ రైతు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ఈ విషయం గురించి అధికారులతో ఫోన్‌లో మాట్లాడేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు, సిపిఎం నాయకులు ఎం. డేవిడ్, కె. శ్రీనివాసరావు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# శాంతినారాయణకు ప్రతిభా పురస్కారం



అనంతపురం,(సందేశం టైమ్స్) : ప్రభుత్వం వివిధ రంగాలకు చెందిన 12 మంది ప్రముఖులకు 12 ప్రతిభా పురస్కాలకు ఎంపిక చేసింది. అందులో రెండు తెలుగు రాష్ట్రాలలో నవలా, కథా ప్రక్రియలకు సంబంధించి జిల్లాకు చెందిన ప్రముఖ కథా, నవల రచయిత శాంతి నారాయణ ను ఏకగ్రీవంగా ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో పలు సాహితీ సంస్థలు హర్షం వ్యక్తపరుస్తున్నాయి. ప్రసిద్ధ నవలా కథా రచయిత, కవి, కాలమిస్టు, సాహిత్య సేవకుడు డా. శాంతి నారాయణకు సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం 2023 వ సంవత్సరానికి నవలా, కథా విభాగంలో ప్రతిభా పురస్కారం ప్రకటించింది. ఈ సందర్భంగా డాక్టర్ శాంతి నారాయణకు సాహితీ స్రవంతి, శ్రీశ్రీ కళావేదిక, అభ్యుదయ రచయితల సంఘం, సాహిత్య భారతి, ఉమ్మడిశెట్టి సాహిత్య ట్రస్ట్, జిల్లా రచయితల సంఘం, తెలుగు వెలుగు, సాహిత్య భారతి, స్పందన అనంతకవుల వేదిక, సాహితీ స్రవంతి, మానవత, అనంత సాహితీ ప్రస్థానం ట్రస్ట్, ఉమరాలీషా సాహిత్య సంస్థ, తెలుగు భాషా సంరక్షణ సమితి, తపన సాహిత్య వేదిక మొదలైన సాహితీ సాంస్కృతిక సామాజిక సంఘాలు శుభాకాంక్షలు చెప్పాయి. డా. శాంతి నారాయణ దాదాపు 70 కథానికలు, నాలుగు నవలలు రచించారు. రెండు సంపుటాలు కవిత్వం రాశారు. నాగలకట్ట సుద్దులు రెండు సంపుటాలు ప్రచురించారు. అనంతపురం జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగా అద్భుతంగా పనిచేశారు. విమలాశాంతి సాహితీ సామాజిక సామాజిక సేవాసమితి ద్వారా రచయితలకు పురస్కారాలను, సీనియర్ రచయితలకు జీవిత సాఫల్య పురస్కారాలను ప్రదానం చేస్తున్నారు. అనంతపురం జిల్లాలో శాంతి నారాయణ సాహిత్య సేవలు పలువురికి ఆదర్శం అని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కేంగార మోహన్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి అన్నారు.

# అధ్వానంగా తుని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణం



తుని (కాకినాడ) (సందేశం టైమ్స్) : కాకినాడ, అనకాపల్లి జిల్లాలకు సరిహద్దు ప్రాంతమైన తుని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణం అధ్వానంగా మారింది. ఉపయోగ గోదావరి జిల్లాల జిల్లాలో ఉన్న ఆర్టీసీ బస్సులు విశాఖపట్నం, కాకినాడ నర్సీపట్నం, ఏలేశ్వరం, డిపోలకు చెందిన బస్సులు ప్రతి అరగంటకు బస్సులు రాకపోకలు సాగిస్తాయి. నిత్యము ప్రయాణికులతో రద్దీగా ఉండే కాంప్లెక్స్ లో కనీస వసతులు లేవని ప్రయాణికులు ఆవేదం చెందుతున్నారు. ఇటీవల గత నాలుగు రోజుల నుండి విస్తారంగా కురుస్తున్నవర్షాల వల్ల ఆవరణమంతా వర్షం నీటితో నిండిపోయి దోమలు ఈగలు స్వర విహారం చేస్తున్నాయి. వర్షపు నీరు నిల్వ ఉ ండిపోవడంతో దుర్వాసన వెదజలుతుంది. కాంప్లెక్స్ ఆవరణములోనున్న ఏఎన్ఎల్ పార్సెల్ సర్వీస్ ఇదే పరిస్థితి నెలకొంది. ఏఎన్ఎల్ పార్సెల్ సర్వీస్కు వచ్చే వినియోగదారులకు ఇబ్బందులు తప్పట్లేదు. ఆర్టీసీ కాంప్లెక్స్ కు సమీపంలో ప్రభుత్వం మద్యం దుకాణం ఉ ంది. రాత్రి సమయంలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు పైన వచ్చి మద్యం సేవిస్తున్నారు. తుని పట్టణంలో ఉన్న గొల్ల అప్పారావు లో, కాకినాడ, రాజమండ్రి, రౌతులపూడి,లచ్చిరెడ్డిపాలెం, గ్రామాలకి వెళ్లే పల్లె వెలుగులు బస్సులలో రోజు వేలాదిమంది ప్రయాణికులు తమ రాకపోకలు సాగిస్తారు. ఇక్కడ బస్సు షెల్టర్ లో నిలబడడానికి కూర్చోవడానికి కూడా ఎటువంటి సౌకర్యాలు లేవు.తుని నుండి నర్సీపట్నం ఆయా డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులో ప్రతి 20 నిమిషాలకు బస్సు లు రాకపోకలు సాగిస్తాయి. తుని ఫ్లేవర్ బ్రిడ్జి కింద తుని నుండి నర్సీపట్నం వెళ్లే ప్రయాణికులకు బస్ స్టాప్ ఉంది కానీ అక్కడ ఎటువంటి షెల్టర్ నిర్మాణం చేపట్లేదు. ఈ బస్టాప్ ఆవరణమంతా బురదతోనే నిండుగా ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల నుండి ప్రభుత్వ,ప్రైవేటు విద్యాసంస్థల్లో ఇంటర్మీడియట్,డిగ్రీ, చదివే వందలాది మంది విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. ఆర్టీసీ బస్సు చార్జీలు పెంపుదలపై ఉన్న శ్రద్ధ, ప్రయాణికులకు బస్సు షెల్టర్ నిర్మాణం, వసతులు కల్పించడంలో ప్రజా ప్రతినిధులు శ్రద్ధ చూపడం లేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి తుని ఆర్టీసీ డిపోలోను, తుని పట్టణంలో ఉన్న ఆర్టీసీ బస్ స్టాప్ వద్ద కనీస వసతులు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఆర్టీసీ డిపోలోను, బస్సు స్టాపులు వద్ద ప్రయాణికులకు కనీస వసతులు కల్పించాలి, చార్జీలు పెంపు తలపై ఉన్న శ్రద్ధ ప్రయాణికులు సౌకర్యాలు కల్పించడంలో పాలకులు విఫలమవుతున్నారని అన్నారు.

# జీవాలకు నట్టల నివారణ, వ్యాధి నివారణ టీకాలు



చాగల్లు (తూర్పు గోదావరి)(సందేశం టైమ్స్) : చాగల్లు మండలం మీనానగరం, మార్కొండపాడు, దారవరం గ్రామాలలో చాగల్లు పశువైద్యశాల, ఆధ్వర్యంలో గొర్రెలు మేకల పెంపకందారులకు నట్టల నివారణ మందులు, చిటుక, నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు డాక్టర్ యు ముకేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారుగా 1800 గొర్రెలు, 250 మేకలకు ఉచితంగా మందులు వేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవాల రైతు సంఘం నాయకులు నక్కా జయరాజు, పట్టపగలు.శ్రీనివాసరావు పశు వైద్యాధికారి డా.యు.ముఖేష్, సహాయకులు లక్ష్మీ ప్రసన్న, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# కేసేపల్లి, నడిమిదొడ్డి లో నీటి నాణ్యతను పరిశీలించిన ఎంపిడిఓ



నార్పల (అనంతపురం)(సందేశం టైమ్స్) : నార్పల మండల పరిధిలోని కేసేపల్లి, సిద్దిలచర్ల గ్రామాల్లో గురువారం నీటి నాణ్యత ను ఎంపిడిఓ మమతదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ . ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో పంచాయతీల ద్వారా వస్తున్న నీరు ప్రారంభ స్థానం, ముగింపు ప్రాంతం నుండి నీరు సేకరించి నాణ్యతగా ఉందా లేదా అని నీటిని పరిశీలించి 12 రకాల పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు గ్రామీణ ప్రజలు కలుషితం అయిన నీరు తాగి అనారోగ్యానికి గురి కాకూడదు అని ఈ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రజలు కూడా ఎప్పడికప్పుడు నీటి నాణ్యత పై అవగాహన కలిగి ఉ ండాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు లక్ష్మీదేవి, రాజేశ్వరి, కుళ్లయప్ప, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లు వినరు, మధు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## భారత్ పాక్‌లను ఒకే గాటన కడతారా

'ఉగ్రవాదం ఒక మతాన్ని మించినది' అంటూ జూన్ 17న సిహెచ్.ఎస్.ఎన్.మూర్తి రాసిన వ్యాసం అసంబద్ధంగా ఉంది. ఆయన హిందూ వ్యతిరేకత, ముస్లిం సంతుష్టీకరణ ఈ వ్యాసంలో స్పష్టంగా కనపడింది. భారత్ ఉగ్రవాద పీడిత దేశం కాదని, ఇది ఒక తప్పుడు ప్రచారం అని, ఉగ్రవాద నిర్మూలన పేరుతో ఈ దేశంలో ప్రభుత్వాలు ముస్లింలను టార్గెట్ చేసి, చంపి వేస్తున్నాయని వ్యాసంలో చెప్పడం సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. బెలూచిస్థాన్ ప్రాంతంలోని ముస్లిం ఉగ్రవాదుల వల్ల పాకిస్థాన్ ప్రభుత్వం చాలా ఇబ్బందుల్ని ఎదుర్కొంటుందని, అందువల్లనే భారతదేశం కంటే పాకిస్థాన్‌లో ఎక్కువమంది ముస్లింలు చనిపోతున్నారని రచయిత వాపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. కశ్మీర్ వేర్పాటువాదులకు వంతపాడి, బెలూచిస్థాన్ వేర్పాటువాదులను దెప్పిపొడవడం ఎందుకు? కశ్మీర్ 370 ఆర్టికల్‌ను అడ్డు పెట్టుకొని కశ్మీర్ వేర్పాటువాదులు జరిపిన నరమేధాన్ని ప్రజా పోరాటం అంటారా? ఈ వేర్పాటువాదుల దుశ్చర్యల వల్ల మూడు లక్షల మంది హిందువులు సర్వస్వాన్ని వదులుకొని, లోయ నుంచి పారిపోయి వచ్చారు. మైనారిటీలకు భయపడి మెజారిటీ మత?స్థులు పారిపోయి రావడం ఈ భూమండలంపై ఎక్కడా జరగదు. భారతదేశంలో 562 సంస్థానాలు విలీనమైనట్లే కశ్మీరు సంస్థానం కూడా విలీనమైంది. ఆనాటి కశ్మీర్ సంస్థానం రాజు రాజా హరిసింగ్‌ను ఒప్పందానికి ఒప్పించిన ఆరెస్సెస్ రెండవ అధ్యక్షులు గురుజీ ఇదే విషయాన్ని స్పష్టీకరించారు. ఒక ప్రాంతంలో ముస్లింలు ఎక్కువగా ఉన్నంత మాత్రాన ప్రత్యేక హక్కులు ఇవ్వబడతాయా? మరి హిందువులు మెజారిటీగా ఉన్న ప్రాంతాల్లో ఇలాంటి వాదనలు తలెత్తవా? కశ్మీర్ వేర్పాటు ఉద్యమాన్ని సమర్థించే వాళ్ళందరూ కూడా ఈ దేశానికి వ్యతిరేకులే. కశ్మీరీల స్వయం నిర్ణయాధికారం కోసం నడిపిన ఉద్యమంలో కశ్మీరీ పండిట్లు పాల్గొన్నారని చెప్పడం పచ్చి అబద్ధం! ఇక దేశ విభజన మతం ఆధారంగా ఎందుకు జరిగింది? విభజనను కోరింది ఎవరు? ఇందుకు పునాది ఏమిటి? ఈ విషయంలో హిందువుల పాత్ర ఎంత? ఇత్యాది విషయాలను కూలంకషంగా చర్చిస్తే వాస్తవాలు బోధపడతాయి. కాంగ్రెస్ ఆధ్వర్యంలో నడిచే స్వాతంత్ర్య ఉద్యమాన్ని అడ్డుకోవడానికి 1906లో బ్రిటిష్ నాయకుల సలహా మేరకు ముస్లిం లీగ్ సంస్థ ఏర్పాటు చేయబడిందనే విషయం అర్థమైతే వాస్తవ విషయాలు స్ఫురణకు వస్తాయి. ఇస్లాం సమాజంలో సంస్కరణలు కావాలని కోరిన సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ ఈ దేశంలో ద్విజాతి సిద్ధాంతాన్ని ముస్లిం సమాజం ముందు ఉంచిన విషయంపై వ్యాసకర్తకు అవగాహన లేదనిపిస్తుంది. 1946లో రాజ్యాంగ సభకు జరిగిన ఎన్నికలలో 80 సీట్లకు పోటీ చేసిన ముస్లిం లీగ్ ముస్లింలు మెజారిటీగా ఉండే ప్రాంతాల్లో 73 సీట్లు గెలిచింది. అఖండ భారత్ నిర్మాణమే లక్ష్యంగా జాతీయ కాంగ్రెస్ 1585 సీట్లకు పోటీ చేస్తే కేవలం 925 సీట్లు మాత్రమే గెలిచింది. హిందువులు ముస్లింలు కలిసి ఉండాలనే భావనకు మద్దతు లభించలేదనే విషయం స్పష్టమైంది. మతం ఆధారంగా దేశ విభజన జరగాలని ఈ దేశంలో ముస్లింలందరూ కోరుకున్నారు. అందుకు అనుకూలంగా ఓటు వేశారు. ఈ ఎన్నికల విజయంతో చెలరేగిపోయిన ముస్లిం లీగ్ నాయకులు 1946 ఆగస్టులో డైరెక్ట్ యాక్షన్‌కు పిలుపునిచ్చి, హిందువులపై నరమేధానికి కారణమయ్యారు. ఈ నరమేధాన్ని కళ్ళారా చూసిన కాంగ్రెస్ నాయకులు భయపడి దేశ విభజనకు ఒప్పుకున్నారనేది వాస్తవం. ఈ చారిత్రక సత్యాన్ని దేశ ప్రజలకు తెలియనీయకుండా లౌకికవాద ముసుగు వేసుకున్న హిందూ వ్యతిరేక హిందువులు, స్వయం ప్రకటిత మేధావులు తమకు తోచిన రీతిలో ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. అమెరికా, రష్యా మధ్య ఏర్పడిన ప్రచ్ఛన్న యుద్ధ పరిస్థితులు బంగ్లాదేశ్ ఏర్పాటుకు, భారత్ పాకిస్థాన్ యుద్ధానికి కారణమని వ్యాస రచయిత చెప్పడం చారిత్రక అవగాహన లేకపోవడమే! 1970లో షేక్ ముజిబుర్ రహ్మాన్ ఆధ్వర్యంలో నేషనల్ అవామీ లీగ్ పార్టీ బంగ్లాదేశ్ ఎన్నికల్లో విజయం సాధించడంతో ఉర్దూ మాట్లాడే పశ్చిమ పాకిస్థాన్ నాయకులకు ఒళ్ళు మండింది. సైన్యాన్ని ఉసిగొలిపి, బెంగాలీ ముస్లింలను ఊచకోత కోయించారు. అనేక లక్షలమంది హిందువులు, ముస్లింలు భారతదేశంలోకి పారిపోయి వచ్చారు. ఈ భయంకర పరిస్థితుల్లో తూర్పు పాకిస్థాన్‌లోని ప్రజల రక్షణార్థం భారత సైన్యం జోక్యం చేసుకోవలసి వచ్చింది. దీన్ని విస్తరణవాదం అని ఎలా సూత్రీకరిస్తారు. పాకిస్థాన్, భారతదేశాల్లోని పాలకులు ఉగ్రవాదాన్ని మతాన్ని మేళవించి పాలన చేస్తున్నారని చెప్పడం అత్యంత వివాదాస్పదం. భారత్ పార్లమెంటరీ ప్రజాస్వామ్య పంథాను ఎన్నుకున్నది. ఇక్కడ రాజ్యాంగబద్ధంగా ప్రభుత్వాలు ఎన్నుకోబడుతున్నాయి. ప్రజాస్వామ్యయుతంగా పాలన సాగుతుంది. ఇక పాకిస్థాన్‌లో మతవాదులు, సైన్యం కలిసి ప్రజలను పీక్కు తింటున్నారు. ఎన్నుకున్న ప్రభుత్వాలు ఎంత కాలం పరిపాలనలో ఉంటాయో తెలియదు. ఇస్లామిక్ తీవ్రవాదానికి ఆ దేశం అడ్డాగా ఉంది.

# గోవిందరాజుల దేవాలయ ప్రాంతంలో అగ్నిప్రమాదం దురదృష్టం.



తిరుపతి (సందేశం టైమ్స్): తిరుపతి గోవిందరాజుల దేవాలయ ప్రాంతంలోని సన్నిధి వీధిలో అగ్ని ప్రమాదం జరగడం దురదృష్టకరం. ప్రమాదం చోటు చేసుకున్న సన్నిధి ప్రాంతాన్ని తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డా శిరీష సందర్శించారు. నగర పాలక సంస్థ విపత్తు నివారణ, అగ్ని మాపక శాఖ అధికారి శ్రీనివాస రావుతో కలిసి అగ్ని ప్రమాదానికి గురైన షాపును మరియు సన్నిధి వీధిలో ఉన్న ఇతర షాపులను సందర్శించి ఘటన కారణాలను అడిగి తెలుసుకున్నారు. షాపు నిర్వాహకులు అగ్నిప్రమాద శాఖ నిబంధనలు పాటించి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని కోరారు. నిర్లక్ష్యం వద్దు ఆలయ ప్రాంతంలో భక్తుల సందర్శన ఉంటుంది కనుక ఈ ప్రాంతంలో ఉన్న షాపులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమగ్ర నివేదిక ఇవ్వాలని విపత్తు నివారణ అగ్ని మాపక శాఖకు ఆదేశం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదాన్ని సకాలంలో నివారించిన తిరుపతి విపత్తు నివారణ , అగ్ని మాపక అధికారులను, సిబ్బందిని మేయర్ అభినందించారు. అదే సమయంలో గోవిందరాజుల దేవాలయ ప్రాంతంలో జరిగిన ఘటన నేపథ్యంలో నగరంలోని కీలక ప్రాంతాలలో ఉన్న షాపులలో నిబంధనలు పాటించే విధంగా చూడాలని మొత్తం నగర పరిధిలో వాస్తవ పరిస్థితులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. తిరుపతి నగరం శ్రీవారి భక్తులు సందర్శించే ప్రాంతం కనుక ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. షాపు నిర్వాహకులకు తగిన జాగ్రత్తలు తీసుకునేలా చైతన్యం కల్పించాలని అదే సమయంలో నిబంధనలు పాటించే విషయంలో రాజీ ధోరణి ఉండకూడదన్నారు. అగ్ని ప్రమాదానికి గురి అయిన షాపుతో సహా మొత్తం పరిస్థితి పై నివేదిక ఇవ్వాలని నగర పాలక సంస్థ విపత్తు నివారణ శాఖను ఆదేశించారు.

# లేబర్ కోడ్స్‌తో తీరని నష్టం



పెద్దారవీడు(సందేశం టైమ్స్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 9వ తేదీన దేశ వ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం రఫీ విజ్ఞప్తి చేశారు. పెద్దారవీడు మండలంలోని దేవరాజు గట్టులో సిఐటియు మండల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా రఫీ మాట్లాడారు. లేబర్ కోడ్‌లు కార్మికులకు తీరని నష్టం కలిగిస్తాయన్నారు. ఆ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. రైతుకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నల్ల చట్టాలను రద్దు చేయాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని పట్టణ ప్రాంతాలకు విస్తరింపజేయా లన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కార్మికవర్గం బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేశారన్నారు. కనీస వేతన చట్టాన్ని, సమ్మె చేసే హక్కును, హరించే విధంగా కోడ్‌లో ఉండబోతున్నాయన్నారు. ప్రభుత్వ స్కీముల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్లందరినీ రెగ్యులర్ చేయాలని, కార్మికులుగా గుర్తించి కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థలు బిఎస్ఎన్ఎల్, లైఫ్ ఇన్సూరెన్స్ ఆఫ్ ఇండియా, పోస్టల్, రైల్వే, స్టీల్ ప్లాంట్ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టి, కార్మికులకు ఉపాధి దూరం చేసే చర్యలు మోడీ ప్రభుత్వం మానుకోవాలన్నారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల చేత వెట్టి చాకిరీ మానుకోవాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు తిపోతి, బాలనాగమ్మ, రాణి, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు. 3పెద్దదోర్నాల: పెద్దదోర్నాల మండల సిఐటియు విస్తృత స్థాయి సమావేశం బుధవారం యుటిఎఫ్ కార్యాలయంలో సిఐటియు నాయకురాలు నిపోరా అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం రఫీ పాల్గొని మాట్లాడుతూ కార్మికులకు వ్యతిరేక మైన లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాల న్నారు. అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, రైతు వ్యతిరేక నల్ల చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం కార్పొరేట్‌లకు లాభం చేకూర్చేందుకు కార్మికవర్గం బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కోడ్స్‌గా తీసుకురావటానికి వారు వ్యతిరేకించారు. కార్మిక వ్యతిరేక కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని పేర్కొన్నారు. కనీస వేతన చట్టాన్ని, సమ్మె చేసే హక్కును, హరించే విధంగా, కార్మికులను యజమానులకు బానిసలుగా తయారు చేసే చర్యలు మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 8 నెలల జీతాలు వెంటనే ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని పట్టణ ప్రాంతాలకు కూడా అమలు చేయాలని, ఉపాధి హామీ పని రోజులు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు డి సోమయ్య, సిఐటియు మండల నాయకులు వై అరుణ్, కాశయ్య, వై బాబూరావు, ప్రవీణ్య, రాణి, కోటేశ్వరి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం బకాయిలపై వాడి వేడి చర్చ




(సందేశం టైమ్స్): కాకినాడ రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసి సొమ్ములు చెల్లించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వలువురు ప్రజాప్రతినిధులు బుధవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి ప్రజా ప్రతినిధులు సమావేశం నుంచి కొద్దిసేపు వాకౌట్ చేశారు. ఉమ్మడి జిల్లాలోని సాగునీరు, డ్రెయినేజీ వ్యవస్థల ఆధునికీకరణకు, డ్రెయినేజీ బోర్డు పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుతాన్ని కోరుతూ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం కాకినాడలోని జెడ్పి సమావేశ మందిరంలో జెడ్పి చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, డా.బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు, నాలుగు జిల్లాల నుండి జడ్పిటిసి సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో తొలుత రాజోలు ఎంపిపి కేతా శ్రీనివాసరావు మృతికి సంతాపం తెలిపారు. అనంతరం తొలి అజెండాగా వ్యవసాయ శాఖ సమీక్ష చేపట్టగా రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యానికి రెండున్నర నెలలుగా చెల్లింపులు పెండింగ్ ఉన్నాయని, రైతులు ఖరీఫ్ సాగుకు పెట్టుబడి లేక అల్లాడుతున్నారని ఎంఎల్‌సి కుడుపూడి సూర్యనారాయణ అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతుల సమస్యలు పట్టని రాష్ట్ర ప్రభుత్వం, అధికారుల తీరును నిరసిస్తూ వైసిపి ప్రజాప్రతినిధులు అందరూ కొద్ది సేపు సభ నుండి వాక్ అవుట్ చేశారు. వారు తిరిగి వచ్చిన అనంతరం మూడూ జిల్లాల సివిల్ సప్లయిస్ అధికారులు రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్నికి కాకినాడ జిల్లాలో రూ.80 కోట్లు, అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రూ.189 కోట్లు, తూర్పు గోదావరి రూ.130 కోట్ల చెల్లింపుల పెండింగ్ వివరాలను సత్వర చెల్లింపునకు చేపట్టిన చర్యలను సభ్యులకు వివరించారు. పిడిఎస్ బియ్యాన్ని చేరువలో ప్రయివేట్ గొడౌన్‌లో నిల్వచేయడం వల్ల ప్రజాధనం వథా అవుతోందని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు సభ దష్టికి తెచ్చారు. గోదావరి మూడు డెల్టాల పరిధిలో 10.13 లక్షల ఎకరాలకు జూన్-1 నుండి నీరు విడుదల చేశామనిఇరిగేషన్ అధికారులు తెలిపారు. మెట్టలోని ఏలేరు, భూపతిపాలెం, ముసురుమిల్లి ప్రాజెక్టులు, పుష్కర, పురుషోత్తపట్నం లిఫ్ట్‌ల కింద ఆయకట్టుకు ఎందుకు నీరు విడుదల చేయలేదని జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అధికారులను నిలదీశారు. వీటిపై కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి వివరణ ఇస్తూ జూన్-1 నాటికి పురుషోత్తపట్నం వద్ద కనీస నీటి మట్టం స్థాయి 14 అడుగులకు దిగువకు ఉన్నందున ఎత్తిపోతల ద్వారా మెట్ట ప్రాంతానికి నీటి విడుదల సాధ్య పడలేదని, ప్రస్తుతం 14.5 స్థాయికి జలాలు ఉన్నందున పుష్కర ద్వారా రేపటి నుండి నీటి సరఫరా చేస్తామని గిలిన మెట్ట ప్రాజెక్టుల నుండి జూలై 15 నుండి నీరు విడుదల చేస్తారన్నారు. కూనవరం డ్రెన్‌లో చల్లవల్లి-చింతలపూడి లాకుల వరకూ ఉప్పునీరు వెనుకకు తన్నుకు రావడం వల్ల వందలాది ఎకరాల్లో సేద్యం దెబ్బతింటోందని రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ సభ దృష్టికి తెచ్చారు. ఈ సమస్యను పరిశీలించి పరిష్కారానికి ప్రతిపాదనలు సమర్పించాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆ జిల్లా ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

# గంజాయి స్మగ్లర్ల ఆస్తులు ఆటాచ్ చేశాం : ఈగల్ చీఫ్ రవి



ఏలూరు(సందేశం టైమ్స్) : గంజాయిని అక్రమ రవాణా చేసే వారి ఆస్తులు ఆటాచ్ చేశామని ఈగల్ చీఫ్ రవికుమార్ తెలిపారు. గురువారం ఉదయం ఏలూరులోని రైల్వే స్టేషన్‌లో ఈగల్ ఐజి రవికష్ణ, ఈగల్ ఎస్‌పి నాగేశ్వరరావు, ఏలూరు జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు చేశారు. అనంతరం ఈగల్ ఐజి రవికృష్ణ మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చే కూలీలు గంజాయి రవాణాకు పాల్పడుతున్నారన్న సమాచారంతో రైళ్లల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఆపరేషన్ విజయ అని పేరు పెట్టమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈగల్ టీం ప్రారంభించిన అప్పటినుండి ఇప్పటివరకు 21736 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏజెన్సీ ప్రాంతమైన అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తించామని డ్రోన్ సహాయంతో సాగు చేస్తున్న పంటను గుర్తించి వాటిని నాశనం చేస్తున్నామన్నారు. ఈగల్ టీం ముఖ్య ఉద్దేశం మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దటమేనని అందుకు కావలసిన అడుగులను ఈ విభాగం వేస్తుందని ఆయన స్పష్టం చేశారు. డ్రోన్ల సహాయంతో పోలీసింగ్ నిర్వహించడంతో గంజాయి సాగు చేసేవారిలో పూర్తిస్థాయి భయం ఏర్పడిందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి పంటను పూర్తిగా ధ్వంసం చేసినప్పటికీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోకి ఒరిస్సా నుండి చిన్నచిన్న మొత్తాల్లో గంజాయిని సరఫరా చేస్తున్నట్లు తాము గుర్తించామని వీటిని నిర్మూలించేందుకే రైళ్లల్లో ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నామన్నారు. గంజాయి అక్రమ రవాణా వాటి నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నెంబర్ను ఏర్పాటు చేసిందని ఎవరైనా అనుమానితులు ఉన్న అనుమానం వచ్చిన వెంటనే 1972 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. అలాగే ఈగల్ టీం ఇంకొంచెం ముందడుగు వేసి గంజాయి అక్రమ రవాణా దారుల ఆస్తులను సైతం జప్తు చేస్తుందని ఈ ప్రక్రియ ఇప్పటికే కొనసాగుతుందని కొంతమంది ఆస్తులు జప్తు చేశామని కూడా ఆయన తెలిపారు. ఎన్ డి పి ఎస్ యాక్ట్ చాప్టర్ 5 ప్రకారం ఈ కేసులో నమోదు చేస్తున్నామని మరో పదహారు మంది పై కేసులు నమోదు చేసేందుకు రంగం సిద్ధం చేశామని ఆయన తెలిపారు. ఇక వలస కూలీల విషయానికి వస్తే కొందరు వలస కూలీలు వచ్చి వెళ్లే సమయాలలో వారు పనిచేసే యజమానులు వారి సామాగ్రిని తరచుగా తనిఖీ చేస్తూ ఉండాలని ఏమాత్రం అనుమానం వచ్చిన వెంటనే 1972 నెంబర్ కు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ ఆపరేషన్ విజయలో భాగంగా ఈగల్ టీం ఏలూరు జిల్లా పోలీసులు జి ఆర్ పి ఆర్ పి ఎఫ్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించామని తెలియజేశారు. ఏలూరు జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా చేసేందుకు తాము పూర్తిగా కృషి చేస్తున్నామని ఆయన తెలియజేశారు. ఏలూరు జిల్లాలో ఇప్పటివరకు 20 కేసులు నమోదు చేశామని.. వాటిలో 700 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని 45 మందిని అరెస్టు చేసి 11 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా అదనపు ఎస్‌పి నక్క.సూర్యచంద్రరావు, ఏలూరు డిఎస్‌పి శ్రావణ్ కుమార్, రెండో పట్టణ సీఐ అశోక్ కుమార్. మూడో పట్టణ సిఐ కోటేశ్వరరావు, ఎక్సైజ్ సీఐ ధనరాజు, ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగానికి దశలవారీగా 9 గంటల విద్యుత్ : మంత్రి గొట్టిపాటి రవి



పొదిలి,(సందేశం టైమ్స్) : రాష్ట్రంలో రైతాంగానికి దశలవారీగా 9 గంటల విద్యుత్ అందిస్తామని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. గురువారం పొదిలి మండలం ఏలూరు గ్రామంలో 33/11 కెవి సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి సబ్ స్టేషన్ పరిధిలో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఏర్పాటు చేస్తున్నామని.. ప్రతి రైతు తన పరిధిలో ఖాళీ స్థలాన్ని సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో రైతాంగానికి పగటిపూట, రాత్రిపూట నాలుగు గంటల పాటు ఇస్తున్న విద్యుత్తును పూర్తిస్థాయిలో 9గంటలు పగటిపూట అందిస్తామన్నారు. ప్రతి నియోజకవర్గానికి పదివేల ప్రధానమంత్రి సూర్యఘర్ కనెక్షన్లు మంజూరు చేసామన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## న్యాయం చేయాలని ఉడా రైతుల నిరసన



పెందుర్తి(విశాఖ)(సందేశం టైమ్స్) : వేపగుంటలో ఉన్న ఉడా వివాదాస్పద భూముల్లో స్థానిక రైతులు గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుమారు 50 సంవత్సరాలుగా ఈ భూమి సమస్య పరిష్కారం కావడం లేదని వాపోయారు. మా స్థలంలో మేము మొక్కలు వేస్తే.. ఉడా వారు వచ్చి మొక్కలను తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పట్లో మా తాతలుకు వాళ్ళకు ఏదో అగ్రిమెంట్ జరిగిందని చెప్తున్నారని.. కానీ మాకు అయితే ఎటువంటి నష్టపరహారం రాలేదన్నారు. ఇక్కడ ఈ సమస్య పరిష్కారం కాకపోవడం వల్ల చుట్టుపక్కల ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్న కానీ ఇక్కడ అభివృద్ధి జరగలేదని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే అధికారులు చొరవ తీసుకొని సమస్య పరిష్కారం చూపాలని కోరారు.

## రబ్బర్ కంపెనీలో మంటలు



హైదరాబాద్,(సందేశం టైమ్స్) : హైదరాబాద్‌లోని కాటేదాన్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. నేతాజీ నగర్‌లోని కార్ రబ్బర్ మాట్స్ తయారు చేసే తిరుపతి రబ్బర్ కంపెనీలో మంటలు ఎగసి పడుతున్నాయి. భారీగా ఎగిసి పడుతున్న మంటలను చూసి స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. కానీ మంటలు అదుపుకావడంలేదు. మంటలకు తోడు నల్లటి పొగ దట్టంగా వ్యాపించింది. దీంతో స్థానికులు భయందోళనకు గురవుతున్నారు.

## తప్పని డోలి మోతలు



ప్రభుత్వాలెన్ని మారినా గిరిజనులకు డోలిమోతలు తప్పడం లేదు. ఎన్నికల ముందు అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మొహం చాటేయడం పాలకులకు అలవాటుగా మారింది. సాక్షాత్తూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి నియోజకవర్గంలోనే డోలిమోతలు కనిపిస్తున్నాయి. పాచిపెంట, సాలూరు మండలాల్లో ఉన్న గిరిశిఖర గ్రామాలకు చెందిన గిరిజనులకు డోలిమోతలు తప్ప మరో మార్గం లేదు. కొండలు, గెడ్డలు దాటుకుంటూ రాళ్లు, రప్పలను తొక్కుకుంటూ కాలినడకన కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే గాని మైదాన ప్రాంతానికి చేరుకోలేని దుస్థితి నెలకొంది.


సాలూరు,(సందేశం టైమ్స్) : సాలూరు మండలం కరడవలస పంచాయతీ ఎగువ కాషాయవలస గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త కూనేటి శ్యామల (45) వాంతులు, విరోచనాలు, జ్వరంతో బాధపడుతూ అపస్మారక స్థితికి చేరింది. పరిస్థితి విషమంగా మారుతుందనే భయంతో ఆమెను బంధువులు డోలిలో కొండలు, గుట్టలు, సువర్ణముఖి నది దాటుకొని కురుకుట్టికి చేర్చారు. అక్కడ నుంచి వెంటనే సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. సకాలంలో వైద్య సేవలు అందడంతో ఆమె ఆరోగ్యం కుదుట పడింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెనుసిపిఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు సుర్రు రామారావు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ సందర్భంగా మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత డోలీలు మోత లేకుండా చేస్తామని ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ప్రకటనలు చేశారని తెలిపారు. అవి ప్రకటనలకే పరిమితమయ్యాయని చెప్పారు. గిరిజన ప్రాంతంలో కనీసం రోడ్లు, మౌలిక సదుపాయాలు లేవన్నారు. కురుకుట్టి ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదని తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## 875 అడుగులకు చేరిన శ్రీశైలం జలాశయం నీటిమట్టం



శ్రీశైలం (సందేశం టైమ్స్) : కృష్ణా ఎగువ పరివాహక ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా శ్రీశైలం జలాశయానికి నీటి ప్రవాహం కొనసాగుతోంది. జూరాల నుంచి బుధవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి విద్యుత్తు ఉత్పాదన ద్వారా 31,380 క్యూసెక్కులు, గేట్ల ద్వారా 32,650 క్యూసెక్కులు మొత్తం 64,030 క్యూసెక్కుల నీరు జలాశయానికి చేరుతోంది. జలాశయ గరిష్ట నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 875 అడుగులు ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.8070 టిఎంసిలు కాగా ప్రస్తుతం 166.3148 టిఎంసిలు ఉంది. తెలంగాణ పరిధిలోని ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్తు కేంద్రంలో గడిచిన 24 గంటలలో 33,639 క్యూసెక్కుల నీటిని వినియోగించి 16.892 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేశారు. కుడిగట్టు జల విద్యుత్ కేంద్రంలో 15,836 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 8.722 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి ద్వారా దిగువ నాగార్జునసాగర్‌కు 59, 475 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కర్నూలు, నంద్యాల జిల్లాల వ్యాప్తంగా బుధవారం ఉదయం నుంచి ఎడతెరపి లేని వర్షం కురుస్తోంది. నగరంలోని రాజ్ విహార్, బళ్లారి చౌరస్తా, కృష్ణానగర్, వీకర్ సెక్షన్ కాలనీ, సి క్యాంప్, నంద్యాల చెక్ పోస్ట్ తదితర ప్రాంతాల్లో రహదారిపై వర్షపు నీరు ప్రవహించింది.

## వరదలకు బాధ్యులెవరో తేల్చండి




అమరావతి :(సందేశం టైమ్స్) : గతేడాది విజయవాడలో సంభవించిన వరదలకు జరిగిన నష్టానికి, వరదలకు 60 మంది ప్రాణాలు కోల్పోయారని, ఈ ప్రాణ నష్టానికి ఎవరు బాధ్యులో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రకృతి ప్రకోపించిందని చెప్పి ఎవరూ బాధ్యులు కాదంటే వీలుకాదని తేల్చి చెప్పింది. విచారణ జరిపి బాధ్యులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలంది. సమగ్ర వివరాలను నివేదించాలని, కౌంటర్ వేయాలని ఆదేశించింది. కనీసం అంతర్గత విచారణ ఏమైనా చేశారో లేదో చెప్పాలంది. విచారణను అక్టోబర్ 8కి వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఆదేశించింది.



# క్రీడావార్తలు



## వైభవ్ ధనాధన్



నార్తాంప్టన్: యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ (31 బంతుల్లో 6 ఫోర్లు, 9 సిక్సర్లతో 86) మెరుపు ఇన్నింగ్స్‌తో చెలరేగడంతో మూడో వన్డేలో భారత్ అండర్-19 జట్టు 4 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ అండర్-19 జట్టుపై గెలిచింది. వర్షం కారణంగా ఆలస్యంగా మొదలైన ఈ మ్యాచ్‌ను 40 ఓవర్లకు కుదించారు. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్.. కనిష్క్ చౌహాన్ (3/30) ధాటికి 40 ఓవర్లలో 268/6 స్కోరు చేసింది. కెప్టెన్ థామస్ రే (76 నాటౌట్), ఓపెనర్ డాకిన్స్ (62) అర్ధ సెంచరీలు చేశారు. ఛేదనలో ఓపెనర్ వైభవ్‌కు తోడు విహాన్ (46), కనిష్క్ (43 నాటౌట్) సత్తా చాటడంతో భారత జట్టు 34.3 ఓవర్లలోనే 274/6 స్కోరు చేసి గెలిచింది. దీంతో ఐదు వన్డేల ఈ సిరీస్‌లో భారత్ 2-1తో ఆధిక్యంలో నిలిచింది. తొలి వన్డేలో భారత్, రెండో మ్యాచ్‌లో ఇంగ్లండ్ గెలిచాయి.

## గిల్.. జిగేల్




బర్మింగ్‌హామ్: క్లాస్ ఆటతో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (216 బంతుల్లో 12 ఫోర్లతో 114 బ్యాటింగ్) వరుసగా రెండో శతకంతో మెరవగా.. యశస్వి జైస్వాల్ (107 బంతుల్లో 13 ఫోర్లతో 87) శుభారంభం అందించడంతో.. ఇంగ్లండ్‌తో రెండో టెస్ట్ తొలి రోజును భారత్ మెరుగ్గా ముగించింది. బుధవారం ఆరంభమైన టెస్ట్‌లో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 85 ఓవర్లలో 310/5 స్కోరు చేసింది. మొదటి రోజు ఆట చివరకు గిల్‌తోపాటు జడేజా (41 బ్యాటింగ్ ) క్రీజులో ఉన్నాడు. కరుణ్ నాయర్ (31) మరోసారి విఫలమయ్యాడు. క్రిస్ వోక్స్ రెండు వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో భారత్ మూడు మార్పులు చేసింది. బుమ్రాకు విశ్రాంతినివ్వగా.. సాయి సుదర్శన్, శార్దూల్ ఠాకూర్‌పై వేటు వేశారు. వారి స్థానాల్లో వాషింగ్టన్ సుందర్, నితీశ్ కుమార్‌తోపాటు పేసర్ ఆకాశ్‌దీపకు తుది జట్టులో చోటు దక్కింది. ఇంగ్లండ్ మాజీ ఆటగాడు వేన్ లార్కిన్స్ మృతికి సంతాపంగా నల్లరిబ్బన్లు ధరించారు. చెలరేగిన జైస్వాల్..: ఇంగ్లండ్ బౌలర్లు జైస్వాల్‌ను తీవ్రంగా పరీక్షించినా.. అతడు మాత్రం ఓపిగ్గా క్రీజులో నిలదొక్కుకొనేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో జైస్వాల్‌ను దాదాపుగా వికెట్ల ముందు దొరకబుచ్చుకొన్నాడు. కానీ, రివ్యూలో అంపైర్ కాల్ కావడంతో జైస్వాల్ ఊపిరిపీల్చుకొన్నాడు. కానీ, మరో ఓపెనర్ రాహుల్ (2) దారుణంగా విఫలమయ్యాడు. 26 బంతులాడిన రాహుల్.. వోక్స్ బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యాడు. అనంతరం వన్‌డౌన్‌లో వచ్చిన కరుణ్ నాయర్.. జైస్వాల్‌కు సహకారం అందించాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 80 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. క్రమంగా గేరు మార్చిన జైస్వాల్ బౌండ్రీతో ఫిఫ్టీ మార్క్‌కు చేరుకొన్నాడు. కానీ, లంచ్‌కు ముందు నాయర్‌ను షార్ట్‌పిచ్ బాల్‌తో అవుట్ చేసిన కార్స్.. జట్టుకు కావల్సిన బ్రేక్‌ను అందించాడు. దీంతో తొలి సెషన్‌లో భారత్ 98/2తో నిలిచింది.

## గాఫ్‌కు ఝలక్



లండన్: వింబుల్డన్‌లో ఊహించని షాక్. ఇటీవలే ఫ్రెంచ్ ఓపెన్ నెగ్గి సమరోత్సాహంతో ఉన్న మహిళల రెండోసీడ్ కొకొ గాఫ్ అనూహ్యంగా తొలి రౌండ్‌లోనే వెనుదిరిగింది. ఈ అమెరికా స్టార్‌కు ఉక్రెయిన్ భామ డయానా యాస్ట్రెమ్‌స్కా ఝలకిచ్చింది. ప్రపంచ 46వ ర్యాంకరైన 25 ఏళ్ల డయానా 7-6 (7-3), 6-1తో ప్రపంచ నెంబర్ 2 గాఫ్‌ను కంగుతినిపించి రెండోరౌండ్‌కు చేరింది. 21 ఏళ్ల గాఫ్.. ఓ గ్రాండ్‌స్లామ్‌లో మొదటిరౌండ్లోనే ఓడడం 2023 తర్వాత ఇదే మొదటిసారి. మరోవైపు టాప్‌సీడ్ సబలెంక 7-6(7-4), 6-4తో మేరీ బౌజ్కోవాపై గెలిచి మూడోరౌండ్ చేరింది. 6వ సీడ్ మాడిసన్ కీస్ 6-4, 6-2తో డానిలోవిచ్ నెగ్గింది. చెక్ రిపబ్లిక్ స్టార్ పెట్రా క్విటోవాకు తానాడిన చివరి వింబుల్డన్‌లో నిరాశే ఎదురైంది. తొలిరౌండ్లోనే ఓటమిపాలైంది.

## యశస్వి జైస్వాల్ హాఫ్ సెంచరీ..

## లంచ్ బ్రేక్ సమయానికి టీమిండియా 98/2



ఇంగ్లండ్, టీమిండియా మధ్య రెండో టెస్ట్ ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ప్రారంభమైంది. ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా లీడ్స్‌లో జరిగిన మొదటి టెస్ట్‌లో టీమిండియాఓటమి పాలైన సంగతి తెలిసిందే. దాదాపు వారం రోజుల విరామం తర్వాత ఎడ్జ్‌బాస్టన్‌లో రెండో టెస్ట్ మొదలైంది. టాస్ గెలిచిన ఇంగ్లీష్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్‌కు జట్టులో చోటు దక్కింది. స్పెషలిస్ట్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను పక్కన పెట్టి మరీ వాషింగ్టన్ సుందర్‌ను తీసుకున్నారు.టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఆరంభంలోనే ఎదురు తిరిగింది. తొలి మ్యాచ్ సెంచరీ హీరో కేఎల్ రాహుల్ (2) 9 ఓవర్లోనే అవుటయ్యాడు. క్రిస్ వోక్స్ వేసిన బంతిని డిఫెన్స్ ఆడబోయి క్లీన్ బౌల్డ్ అయ్యాడు. అయితే మరో ఎండ్‌లో ఓపెనర్ యశస్వి జైస్వాల్ సమయోచితంగా రాణించాడు. 69 బంతుల్లో 11 ఫోర్లతో 62 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. రాహుల్ అవుట్ అయిన తర్వాత బ్యాటింగ్‌కు దిగిన కరుణ్ నాయర్ (50 బంతుల్లో 31) ఫర్వాలేదనిపించాడు. జైస్వాల్, కరుణ్ నాయర్ రెండో వికెట్‌కు 80 పరుగులు జోడించారు.లంచ్ బ్రేక్‌కు ముందు కరుణ్ నాయర్ అవుటయ్యాడు. బ్రైడన్ కార్స్ వేసిన 23.3వ బంతికి హ్యారీ బ్రూక్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దీంతో టీమిండియా రెండో వికెట్ కోల్పోయింది. సెకెండ్ డౌన్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (1 నాటౌట్) బ్యాటింగ్‌కు దిగాడు. తొలి రోజు ఆటలో 25 ఓవర్లు పూర్తైన తర్వాత భోజన విరామ సమయానికి టీమిండియా 98/2తో నిలిచింది. క్రీజులో జైస్వాల్ (62 నాటౌట్), గిల్ (1 నాటౌట్) క్రీజులో ఉన్నారు.

## జ్యోతికి గాయం



న్యూఢిల్లీ: ఆసియా చాంపియన్, తెలుగు అథ్లెట్ యర్రాజి జ్యోతి మోకాలి గాయానికి గురైంది. సాధన చేస్తున్న సమయంలో తన మోకాలికి గాయమైందని జ్యోతి బుధవారం సోషల్ మీడియా ద్వారా తెలిపింది. 100 మీటర్ల హర్డిల్స్‌లో జాతీయ రికార్డు గ్రహీత అయిన 25 ఏళ్ల జ్యోతి.. ప్రస్తుతం ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిపనకు అర్హత సాధించడమే లక్ష్యంగా కఠోరంగా శ్రమిస్తోంది. ఈ పరిస్థితుల్లో ఆమె గాయానికి గురవడం ప్రపంచ చాంపియన్‌షిపలో భారత పతక అవకాశాలకు గండి పడినట్టే. ప్రపంచ టోర్నీ సెప్టెంబరు 13 నుంచి 21 వరకు టోక్యోలో జరగనుంది. జ్యోతి ప్రస్తుత గాయానికి సర్జరీ చేయాల్సిన అవసరముందని భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫఐ) వర్గాలు వెల్లడించాయి. ప్రపంచ చాంపియన్‌షిపనకు అర్హత సాధించాలంటే 12.73 సెకన్ల టైమింగ్‌ను జ్యోతి అందుకోవాల్సి ఉంది. అలా కాకుండా ర్యాంకింగ్స్ ప్రకారం నేరుగా టోర్నీలో తలపడాలంటే జ్యోతి.. ప్రస్తుతం తన 12వ ర్యాంక్‌ను క్వాలిఫికేషన్స్‌కు కటాఫ్ తేదీ అయిన ఆగస్టు 24 దాకా కాపాడుకోవాలి.

## క్రికెట్‌లోనే అతిపెద్ద సమరం..

## వాటే ఐడియా సర్ జీ!

క్రికెట్‌లో ఐపీఎల్ ఒక సంచలనం అనే చెప్పాలి. భారత క్రికెట్ బోర్డు దగ్గర నుంచి టీమిండియా ప్లేయర్లు, దేశవాళీ క్రికెటర్లు, ఓవర్సీస్ ఆటగాళ్ల వరకు.. బంగారు గుడ్లు పెట్టే క్యాష్ రిచ్ లీగ్‌తో ఎంతో మంది కోట్లు వెనకేసుకున్నారు. దీంతో ఐపీఎల్‌ను చూసి ఇతర దేశాల్లోనూ బోలెడు పొట్టి లీగ్‌లు పుట్టుకొచ్చాయి. పాకిస్థాన్ ప్రీమియర్ లీగ్, బిగ్ బాష్ లీగ్, ది హండ్రెడ్, సౌతాఫ్రికా ప్రీమియర్ లీగ్, లంక ప్రీమియర్ లీగ్.. ఇలా దాదాపుగా ప్రతి క్రికెట్ టీమ్ తమ దేశంలో ఒక లీగ్‌ను తీసుకొచ్చింది. అయితే ఇప్పుడీ లీగ్స్‌తో ఓ పెద్ద ప్రయోగమే జరగబోతోంది. ఈ అన్ని టీమ్స్‌ను కలిపి ఓ మహా సమరానికి సన్నాహాలు చేస్తున్నారు. దీని గురించి మరింతగా తెలుసుకుందాం..క్రికెట్‌లోనే బిగ్ ఫైట్‌కు త్వరలో తెరలేవనుంది. వచ్చే ఏడాది వరల్డ్ క్లబ్ చాంపియన్‌షిప్-2026 నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఇండియన్




ప్రీమియర్ లీగ్, బిగ్ బాష్, ది హండ్రెడ్‌తో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఇతర బడా క్రికెట్ లీగ్స్‌లో చాంపియన్‌లుగా నిలిచిన పలు ఇతర జట్లతో ఓ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. అదే వరల్డ్ క్లబ్ చాంపియన్‌షిప్. దాదాపుగా ఇదే ఫార్మాట్‌లో ఒకప్పుడు చాంపియన్స్ లీగ్ నిర్వహించేవారు. ఇప్పుడు అదే లీగ్‌ను సరికొత్తగా వరల్డ్ క్లబ్ చాంపియన్‌షిప్ రూపంలో మళ్లీ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఐపీఎల్ నుంచి 3 జట్లు ఈ టోర్నీలో ఆడతాయని వినిపిస్తోంది. పీఎస్ఎల్, బీబీఎల్, ఎస్ఏ20, సీపీఎల్, ది హండ్రెడ్ నుంచి కొన్ని జట్లు పాల్గొంటాయని సమాచారం. 2026 మార్చి నుంచి మే వరకు ఈ టోర్నీ నిర్వహణకు ప్లానింగ్ జరుగుతోందని తెలుస్తోంది.

# బిజినెస్



## వినియోగదారులకు వీఐ తీపి కబురు.. రీఛార్జ్‌లపై ఏడాదికి 24 రోజులు అదనపు గడువు..!




దేశంలోని ప్రముఖ టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియా , తమ 2%+% హ్యాండ్‌సెట్ వినియోగదారుల కోసం నూతనంగా వీ గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆరంభించింది. ఈ వినూత్న పథకం ద్వారా, రూ. 199 ఆపై విలువ కలిగిన అపరిమిత ప్రీపెయిడ్ వాయిస్ ప్యాక్‌లపై వినియోగదారులు సంవత్సరానికి మొత్తం 24 రోజుల అదనపు గడువు ప్రయోజనం అందుకోనున్నారు. ఈ కార్యక్రమం కింద, రూ. 199 అంతకంటే ఎక్కువ విలువ గల ప్రతి అపరిమిత వాయిస్ రీఛార్జ్ ప్యాక్‌పై 2 రోజుల అదనపు గడువును కస్టమర్ ఖాతాలో జమ చేస్తారు. ఈ 24 రోజుల అదనపు గడువు 12 నెలల వ్యవధిలో క్రెడిట్ అవుతుంది. వాయిస్ మాత్రమే వాడే వారు, లేదా తక్కువ డేటా వినియోగించే ప్రీపెయిడ్ కస్టమర్లు ఎదుర్కొనే దీర్ఘకాల సమస్యను పరిష్కరించే లక్ష్యంతో ఇది రూపొందించబడింది. సంప్రదాయ 28 రోజుల ప్యాక్‌లతో, వినియోగదారులు తరచుగా ఒకే క్యాలెండర్ నెలలో రెండుసార్లు రీఛార్జ్ చేయాల్సి వస్తుంది. కొన్నిసార్లు సేవలు మధ్యలో ఆగిపోతాయి. "వీ గ్యారెంటీ" ప్రారంభంతో, కస్టమర్‌లు ఇకపై సాధారణ 28 రోజులకు బదులుగా 30 రోజుల సర్వీస్ గడువు పొందుతారు. ఇది ప్రతి నెలా ఒకే రీఛార్జ్‌తో సరిపెట్టుకోవడానికి వీలు కల్పిస్తుంది. 28 రోజుల కన్నా ఎక్కువ గడువు ఉన్న రీఛార్జ్‌లలో సైతం, ఈ అదనపు రెండు రోజులు రీఛార్జ్ సైకిల్‌లో ఏర్పడే అంతరాలను పూరించి, ఎక్కువ సౌలభ్యాన్ని నిరంతర సేవలను అందిస్తాయి.

## రోజు రోజుకు పెరుగుతున్న బంగారం ధరలు

బంగారం కొనాలనుకునే వారికి వరుస షాక్‌లు తగులుతున్నాయి. గత వారం రోజుల నుంచి బంగారం ధరలు పెరుగుతున్నాయే తప్ప తగ్గటం లేదు. వారం క్రితం స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర 93 వేల దగ్గర ట్రేడ్ అయింది. వారం రోజుల్లోనే ఊహించని విధంగా .. 98 వేలకు చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్లో కొనసాగుతున్న పరిస్థితులు చూస్తుంటే బంగారం ధరలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. బంగారం కొనాలనుకునే వారు ముందుగానే జాగ్రత్త పడాలని, ధరలు తగ్గినపుడు కొని పెట్టుకోవటం ఉత్తమమని ట్రేడ్ నిపుణులు సూచిస్తున్నారు. హైదరాబాద్ నగరంలో నిన్న 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 90,650 రూపాయల దగ్గర..10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 98,890 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర 74,170 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. నిన్నటితో పోల్చుకుంటే పది గ్రాముల బంగారంపై.. గ్రాముకు ఒక రూపాయి చొప్పున 10 రూపాయలు పెరిగింది. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 98,900 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 90,660 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర .. 74,180 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది.నగరంలో వెండి ధరలు ఇలా .. మొన్నటి వరకు బంగారం ధరలు తగ్గినా వెండి ధరలు మాత్రం పెరుగుతూ పోయాయి. కానీ, ఈ రోజు వెండి ధరలు తగ్గాయి.




నిన్న హైదరాబాద్ నగరంలో 100 గ్రాముల వెండి ధర 12000 దగ్గర ట్రేడ్ అయింది. కేజీ వెండి ధర 1,20,000 దగ్గర ట్రేడ్ అయింది. ఈ రోజు 100 గ్రాముల వెండిపై 10 రూపాయలు, కేజీ వెండిపై 100 రూపాయలు తగ్గింది. 100 గ్రాముల వెండి ధర నేడు 11990 దగ్గర ట్రేడ్ అవుతోంది. కేజీ వెండి ధర 1,19,900 దగ్గర ట్రేడ్ అవుతోంది.

## మేకిన్ ఇండియా కు చైనా గండి

### ఫాక్స్‌కాన్ నుంచి చైనా ఉద్యోగులు వెనక్కి

న్యూఢిల్లీ: భారత్‌పై చైనా ఆర్థిక యుద్ధాన్ని తీవ్రం చేస్తోంది. ఇప్పటికే రేర్ ఎర్త్ మాగ్నెట్లు, ప్రత్యేక ఎరువుల ఎగుమతులపై ఆంక్షలు విధించిన చైనా ఇప్పుడు కొత్తగా భారత్‌లో యాపిల్ ఐఫోన్ల తయారీకి గండి కొట్టేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం యాపిల్ కంపెనీ కోసం భారత్‌లో ఐఫోన్లను తయారు చేసే తైవాన్ కంపెనీ ఫాక్స్‌కాన్ ఫ్యాక్టరీల నుంచి తన ఇంజినీర్లు, సాంకేతిక సిబ్బందిని వెనక్కి తీసుకుంటోంది. గత రెండు నెలల్లోనే దక్షిణ భారత్‌లోని ఫాక్స్‌కాన్ ప్లాంట్లలో పనిచేసే దాదాపు 300 మంది సాంకేతిక సిబ్బందిని చైనా వెనక్కి తీసుకుంది. అయితే ఈ ఆంక్షల కారణంగా భారత కంపెనీలకు తాత్కాలిక ఇబ్బందులే తప్ప, దీర్ఘకాలికంగా వచ్చే ఇబ్బందులు ఏమీ ఉండక పోవచ్చని నిపుణుల అంచనా. ఎందుకంటే ?: కొవిడ్ తర్వాత అమెరికా, ఈయూ, జపాన్ దేశాల కంపెనీలు 'చైనాంవన్' విధానాన్ని అనుసరిస్తున్నాయి. ఇందులో భాగంగా తమ ఉత్పత్తి యూనిట్లను చైనా నుంచి భారత్, వియత్నాం వంటి దేశాలకు తరలిస్తున్నాయి. యాపిల్ కంపెనీ అయితే ఇప్పటికే తన ఐఫోన్లలో 20 శాతం భారత్




నురచి దిగుమతి చేసుకుంటోంది. వచ్చే ఏడాదికల్లా దీన్ని మరింత పెంచబోతున్నట్టు ప్రకటించింది. దీంతో ప్రపంచ ఫ్యాక్టరీగా తనకున్న ఆధిపత్యం ఎక్కడ చేజారుతుందోనని చైనా భయపడుతోంది. దీనికి తోడు గల్వాన్ సరిహద్దు ఘర్షణల తర్వాత మన దేశం చైనా కంపెనీల పెట్టుబడులపై కఠిన ఆంక్షలు విధించింది. మన టెలికం కంపెనీలు ప్రారంభించిన 4జీ, 5జీ నెట్‌వర్క్‌ల విస్తరణలోనూ ప్రభుత్వం చైనా కంపెనీలను అనుమతించలేదు. ఈ అక్కసుతోనే చైనా ప్రభుత్వం మన దేశ కంపెనీలకు టెక్నాలజీ బదిలీ, నిపుణులైన సిబ్బంది రాకపోకలపై ఆంక్షలు కట్టుదిట్టం చేస్తోందని భావిస్తున్నారు.

## కంపెనీ రుణ ఖాతాను మోసాల జాబితాలో చేర్చాలని ఎస్‌బీఐ నిర్ణయం




న్యూఢిల్లీ: అనిల్ అంబానీకి చెందిన దివాలా టెలికం కంపెనీ రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) రుణాన్ని మోసపూరిత ఖాతాల్లో చేర్చాలని ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ నిర్ణయించింది. అలాగే, ఈ రుణ మోసంపై ఆర్‌బీఐకి పంపనున్న నివేదికలో ఆర్‌కామ్ మాజీ డైరెక్టర్ అనిల్ అంబానీపైనా ఎస్‌బీఐ ఫిర్యాదు చేయనుంది. దీంతో, ఆర్‌కామ్‌కు గతంలో రుణాలిచ్చిన ఇతర బ్యాంక్‌లు సైతం ఎస్‌బీఐ బాటను అనుసరించే అవకాశం ఉంది. ఎస్‌బీఐ తాజా నిర్ణయం తనను దిగ్భ్రాంతికి గురి చేసిందని అనిల్ అంబానీ అన్నారు. రుణ నిధుల వినియోగంలో సంస్థ నిబంధనలను అతిక్రమించినట్లు గుర్తించడంతో ఆర్‌కామ్ రుణాన్ని మోసపూరిత ఖాతాల జాబితాలో చేర్చాలని ఎస్‌బీఐకి చెందిన మోసాల గుర్తింపు కమిటీ (ఎఫ్ఐసీ) నిర్ణయించింది. ఈ నిర్ణయానికి సంబంధించి జూన్ 23వ తేదీతో కూడిన లెటర్ ద్వారా ఎస్‌బీఐ తమకు సమాచారం అందించిందని ఆర్‌కామ్ బుధవారం స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు వెల్లడించింది. ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం.. బ్యాంక్ ఏదైనా కంపెనీకిచ్చిన రుణాన్ని మోసపూరిత ఖాతాల జాబితాలో చేర్చినట్లయితే, ఆ విషయాన్ని 21 రోజుల్లో ఆర్‌బీఐకి రిపోర్ట్ చేయాలి. అలాగే, సీబీఐ లేదా పోలీసులకు కూడా ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. ఆర్‌కామ్, దాని అనుబంధ సంస్థలు బ్యాంక్‌ల నుంచి మొత్తం రూ.31,580 కోట్ల రుణాలు తీసుకున్నాయని ఎస్‌బీఐ తన లేఖలో వెల్లడించింది. పలు బ్యాంక్‌ల నుంచి తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించడంలో ఆర్‌కామ్ విఫలమవడంతో బ్యాంక్‌లు కంపెనీ రుణ ఖాతాలను 2016 లోనే మొండి పద్దుల జాబితాలో చేర్చాయి. అయితే, ఈ రుణాల వినియోగంలో నిబంధనలను అతిక్రమించారన్న ఆరోపణలపై స్పందించేందుకు గడిచిన రెండేళ్లలో ఆర్‌కామ్‌తో పాటు అనిల్ అంబానీకి పలు అవకాశాలివ్వడం జరిగిందని, వారి నుంచి సరైన స్పందన లభించలేదని ఎస్‌బీఐ పేర్కొంది. గత ఏడాది కెనరా బ్యాంక్ కూడా ఆర్‌కామ్ రుణ ఖాతాను మోసంగా వర్గీకరించింది. కానీ, బాంబే హైకోర్టు బ్యాంక్ నిర్ణయంపై స్టే విధించింది. ఎస్‌బీఐ తాజా చర్యలకు వ్యతిరేకంగా ఆర్‌కామ్ కోర్టును ఆశ్రయించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.

## ఎంసీఎల్‌ఆర్ రేటును తగ్గించిన ఇండియన్ బ్యాంక్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఇండియన్ బ్యాంక్ రిటైల్ రుణాలపై నిధుల సమీకరణ వ్యయాల ఆధారిత వడ్డీరేటును (ఎంసీఎల్‌ఆర్) 0.05 శాతం మేరకు తగ్గించింది. దీంతో ఈ రేటు 9 శాతానికి దిగివచ్చింది. ఈ కొత్త రేటు గురువారం నుంచే అమలులోకి వస్తుంది. దీంతో ఆటో, పర్సనల్, గృహరుణాలు మరింత చవుక అవుతాయి. అలాగే కస్టమర్లకు మరింత సౌలభ్యం కల్పించడం లక్ష్యంగా బ్యాంకు ఖాతాలో కనీస నిల్వ నిర్వహించకపోతే విధించే చార్జీలను పూర్తిగా ఎత్తివేసింది. ఇది జూలై 7 నుంచి అమలులోకి వస్తుంది.




## మైక్రోసాఫ్ట్‌లో మరో 9000 ఉద్యోగాల కోత




రెడ్‌మాండ్(అమెరికా): అంతర్జాతీయ టెక్నాలజీ దిగ్గజం, విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్ రూపకర్త మైక్రోసాఫ్ట్ వ్యయ నియంత్రణలో భాగంగా మరో విడత భారీ ఉద్యోగాల కోతకు శ్రీకారం చుట్టింది. ఈ సారి కంపెనీ మొత్తం సిబ్బంది 2.28 లక్షల మందిలో 4 శాతానికి సమానమైన 9,100 మందికి ఉద్వాసన పలకాలని నిర్ణయించినట్లు తెలిసింది. బుధవారం నుంచే వారికి పింక్ స్లిప్‌లు ఇవ్వడం ప్రారంభించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కంపెనీ కార్యాలయాల్లోని ఉద్యోగులపై ఇది ప్రభావం చూపనుందని, ప్రధానంగా సేల్స్, ఎక్స్‌బాక్స్ వీడియో గేమ్ విభాగాల్లో అధిక కోతలుంటాయని మైక్రోసాఫ్ట్ తెలిపింది. కంపెనీ ఉద్యోగులను తగ్గించుకోవడం ఈ ఏడాదిలో ఇది రెండోసారి. మే నెలలో దాదాపు 6,000 మందిని బయటికి సాగనంపింది.

## రాబడి, పన్ను ఆదా చేసే టాప్ 3 మ్యూచువల్ ఫండ్స్

మీరు పన్ను ఆదా చేస్తూనే మంచి రాబడిని పొందాలనుకుంటున్నారా. అయితే ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ ఎంపిక మంచి ఛాయిస్ అని చెప్పవచ్చు. ఈ ఫండ్స్ ఈక్విటీలలో పెట్టుబడి పెట్టడం ద్వారా మీరు దీర్ఘకాలిక రాబడిని పొందుతారు. దీంతోపాటు ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షల వరకు పన్ను మినహాయింపును కూడా పొందవచ్చు. ఈ నేపథ్యంలో మూడు ప్రముఖ ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్ గురించి తెలుసుకుందాం.

మోతీలాల్ ఓస్వాల్ ఈఎల్ఎస్ఎస్ ఫండ్ గత 5 సంవత్సరాలలో సంవత్సరానికి 29.31% రాబడిని




అందించింది. ఇది మంచి పనితీరును కలిగి ఉంది. ఈ ఫండ్ నికర ఆస్తి విలువ ( రూ.61.13 కాగా, ఇది రూ.4,360 కోట్ల ఆస్తులను నిర్వహిస్తోంది. 2014 డిసెంబర్‌లో ప్రారంభమైన ఈ ఫండ్, నిఫ్టీ 500 టీఆర్ఐ బెంచ్‌మార్క్‌తో పోలిస్తే సంవత్సరానికి 18.81% రాబడిని సాధించింది. ఈ ఫండ్ ఖర్చు నిష్పత్తి కేవలం 0.64%. ఇది ఈ విభాగంలో అత్యంత తక్కువ కావడం విశేషం. దీనిలో కనీస సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (కనీస పెట్టుబడి రూ.500గా ఉంది. కనీస లంప్‌సమ్ రూ.1,000. గత 5 సంవత్సరాలలో రూ.3.5 లక్షల ఒకేసారి పెట్టుబడి ఈ ఫండ్‌లో రూ.12,66,000 కార్పస్‌గా మారింది.

ఎస్‌బీఐ టాక్స్ సేవర్ ఫండ్ ఎస్‌బీఐ ఈఎల్ఎస్ఎస్ టాక్స్ సేవర్ ఫండ్ గత 5 సంవత్సరాలలో సంవత్సరానికి 28.71% రాబడిని అందించింది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006